www.bhadradrinews.com

భద్రాద్రి న్యూస్

తెలుగు దినపత్రిక

Bhadradrinews Telugu Daily

హైదరాబాద్, సంపుటి : 4 సంచిక: 274, మంగళవారం 3-11-2026 ఎడిటర్ : చెంగపొంగు సైదులు పేజీలు : 6 వేల : 5

Published from Khammam,Circulated by Hyderabad, Karimnagar, adilabad, Nizamabad, Warangal, Nalgonda, Mahabubnagar, Khammam

ప్రతి దరఖాస్తును గడువులోగా పరిష్కరించాలి: కలెక్టర్ అంకిత్



3 లో..

దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి



4 లో..

కదంతొక్కిన కాషాయ శ్రేణులు

త్రివర్ణ పతాకం చేతబూని హైదరాబాద్‌లో అమిత్ షా పాదయాత్ర..

'ఇండియా' కూటమికి వ్యతిరేకంగా హైదరాబాద్‌లో కేంద్ర మంత్రి అమిత్ షా మహా పాదయాత్ర

'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి, అరాచకాన్ని తొలగించండి' నినాదంతో బీజేపీ ర్యాలీ

బషీర్‌బాగ్ నుంచి మొజాంజాహీ మార్కెట్ వరకు 1.5 కిలోమీటర్ల మేర పాదయాత్ర

పాదయాత్రకు ముందు చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయంలో అమిత్ షా ప్రత్యేక పూజలు

కాంగ్రెస్ తీరుపై సోషల్ మీడియా వేదికగా అమిత్ షా తీవ్ర విమర్శలు



హైదరాబాద్, నవంబర్ 2

కేంద్ర హోంమంత్రి అమిత్ షా సోమవారం హైదరాబాద్‌లో మహా పాదయాత్ర చేపట్టారు. 'ఇండియా' కూటమి చేపట్టిన ప్రచారాన్ని తిప్పికొట్టే లక్ష్యంతో బీజేపీ దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా ఈ పాదయాత్ర సాగింది. 'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి, అరాచకాన్ని తొలగించండి' అనే నినాదంతో ఈ ర్యాలీని నిర్వహించారు.

నగరంలోని బషీర్‌బాగ్‌లో ఉన్న బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద ఈ పాదయాత్ర ప్రారంభమైంది. జాతీయ జెండా చేతబూని అమిత్ షా ముందుకు సాగగా, ఆయనతో పాటు కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వందలాది మంది కార్యకర్తలు పాల్గొన్నారు. సుమారు 1.5 కిలోమీటర్ల మేర సాగే ఈ పాదయాత్ర మొజాంజాహీ మార్కెట్ వద్ద ముగియనుంది. అక్కడ జరిగే కార్నర్ మీటింగ్‌లో అమిత్ షా ప్రసంగించనున్నారు. ఢిల్లీలో ఆదివారం 'ఇండియా' కూటమి నిర్వహించిన ర్యాలీలో బీజేపీపై చేసిన విమర్శలకు ఆయన ఇక్కడ దీటైన సమాధానం ఇచ్చే అవకాశం ఉంది.

పాదయాత్రకు ముందు, కాంగ్రెస్ పార్టీని లక్ష్యంగా చేసుకుని అమిత్ షా సోషల్ మీడియా వేదికగా తీవ్ర విమర్శలు చేశారు. "వరుస ఓటములతో కుంగిపోయిన కాంగ్రెస్, ఇప్పుడు అరాచక చర్యలతో ప్రజాస్వామ్యాన్ని హత్య చేసి అయినా సరే అధికారాన్ని దక్కించుకోవాలని చూస్తోంది. కాంగ్రెస్ కుట్రపూరిత ప్రయత్నాల నుంచి మన ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకే ఈ మహా పాదయాత్రలో పాల్గొంటున్నాను" అని ఆయన 'ఎక్స్'లో పేర్కొన్నారు.

నగర పర్యటనలో భాగంగా, తొలుత అమిత్ షా ..మిగతా 2లో



స్వచ్ఛ ఇంధనమే భవిష్యత్తు!

శిలాజ ఇంధనాలపై ఆధారపడితే ఆర్థిక సంక్షోభాలు తప్పవు

పునరుత్పాదక ఇంధన రంగంలో పెట్టుబడులే భారత్ ప్రాధాన్యం

దేశ విద్యుత్ సామర్థ్యంలో 50 శాతానికి పైగా నాన్ ఫాసిల్ వాటా

భారత్ రెన్యువబుల్ ఎనర్జీ సమిట్‌లో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, నవంబర్ 2 :

పశ్చిమాసియాలో సంక్షోభం కొనసాగుతున్నప్పటికీ, భారత్ ఆర్థిక వృద్ధి బలంగా ముందుకు సాగుతోందని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. నిరంతరాయంగా శిలాజ ఇంధనాలపై (ఫాసిల్ ఫ్యూయెల్స్) అతిగా ఆధారపడటం వల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అతలాకుతలం అవుతోందని వ్యాఖ్యానించారు. ఇంధన భద్రత భవిష్యత్తు అంతా క్లీన్ ఎనర్జీలోనే (స్వచ్ఛ ఇంధనం) దాగి ఉందని ఆయన స్పష్టం చేశారు. దిల్లీలోని భారత్ మండపంలో జరిగిన 'భారత్ రెనివబుల్ ఎనర్జీ సమిట్ అండ్ ఎక్స్‌పో (దీ=జూజు) 2026' సదస్సును ప్రారంభించిన అనంతరం మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ప్రపంచ సంక్షోభాలు ప్రతి దేశానికి ఒక స్పష్టమైన సందేశాన్ని ఇచ్చాయని మోదీ అన్నారు. ఇంధన భద్రతకు ఆర్థిక స్థిరత్వంతో ఉన్న బలమైన సంబంధాన్ని ఆయన గుర్తుచేశారు. ఫాసిల్ ఫ్యూయెల్స్ నిల్వలు కొన్ని ప్రాంతాల్లో మాత్రమే పరిమితంగా ఉన్నాయని, అయితే పునరుత్పాదక ఇంధన వనరుల సామర్థ్యానికి అంతులేదని వివరించారు. ప్రతి ప్రాంతం, ప్రతి దేశం కూడా సోలార్, విండ్ వంటి పునరుత్పాదక ఇంధన వనరులను వినియోగించుకునే అవకాశం ఉందని చెప్పారు.

ఆ చొరవ వల్లే భారత్ సంక్షోభాల నుంచి బయటపడింది: మోదీ

గత దశాబ్ద కాలంలో భారత్ సకాలంలో దేశీయంగా పెట్టుబడులు పెంచడం, పలు కీలక కార్యక్రమాల్ని అమలు చేయడం వల్ల ..మిగతా 2లో

మంత్రి పదవి ఇవ్వలేదు..

నిధులూ రావడం లేదు..

రేవంత్ ప్రభుత్వంపై కోమటిరెడ్డి ఆగ్రహం

మంత్రి పదవి ఇస్తామని చెప్పి మోసం చేశారని రాజగోపాల్‌రెడ్డి ఆవేదన

సీఎం, డిప్యూటీ సీఎంను కలిసినా నిధులు రావడం లేదని విమర్శ

నిధుల కోసం ప్రతిపక్ష ఎమ్మెల్యేలాగా పోరాడాల్సి వస్తోందని వ్యాఖ్య

బిల్లులు చెల్లించక రోడ్డు పనులు నిలిచిపోతున్నాయని ఆరోపణ

అభివృద్ధి జరగకపోతే ఎమ్మెల్యే పదవిని వదులుకుంటానని ప్రకటన



హైదరాబాద్, నవంబర్ 2:

తెలంగాణ కాంగ్రెస్‌లో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మరోసారి సొంత ప్రభుత్వంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మంత్రి పదవి ఇస్తామని చెప్పి మోసం చేశారని ఆవేదన వెలిబుచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసి అడిగినా నియోజకవర్గానికి నిధులు రావడం లేదని వాపోయారు. అవసరమైతే ఎమ్మెల్యే పదవిని సైతం త్యాగం చేస్తానంటూ ..మిగతా 2లో

తెలంగాణ నుంచి కూడా కాంగ్రెస్‌ను తరిమికొట్టాలి: అమిత్ షా



తెలంగాణను కాంగ్రెస్ ఏటీఎంగా మార్చుకుందని ఆరోపణ

'ఆర్ఆర్ ట్యాక్స్' వసూలు చేస్తున్నారని వ్యాఖ్య

ఆరు గ్యారెంటీలు అమలు కావడం లేదని విమర్శ

ఈవీఎంలపై రాహుల్ గాంధీ వైఖరిని ప్రశ్నించిన షా

తెలంగాణలోనూ బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా

హైదరాబాద్, నవంబర్ 2 :

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడం లేదని, రాష్ట్రాన్ని ఏటీఎంగా మార్చుకుని 'ఆర్ఆర్ ట్యాక్స్' వసూలు చేస్తోందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆరోపించారు. రేవంత్ రెడ్డి ద్వారా రాహుల్ గాంధీకి ఈ ట్యాక్స్ వెళుతోందని వ్యాఖ్యానించారు. దేశంలో కాంగ్రెస్ పార్టీ అనేక రాష్ట్రాల్లో అధికారం కోల్పోయిందని, ఆ పార్టీ వెంటిలేటర్‌పై ఉందని విమర్శించారు. రాహుల్ గాంధీ కాంగ్రెస్‌ను కాపాడలేరని అన్నారు. తెలంగాణ నుంచి కూడా కాంగ్రెస్‌ను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో సోమవారం నిర్వహించిన బీజేపీ మహా పాదయాత్ర ముగింపు సభలో అమిత్ షా ఈ వ్యాఖ్యలు చేశారు.

'లోకతంత్ర బచావో – అరాచకత హటావో' నినాదంతో తెలంగాణ బీజేపీ ఈ పాదయాత్రను నిర్వహించింది. బషీర్‌బాగ్‌లోని నిజాం కాలేజీ ఎదురుగా ఉన్న డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం నుంచి ప్రారంభమైన యాత్ర అబిడ్స్ మీదుగా మోజంజాహీ మార్కెట్ వరకు సాగింది. అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ..మిగతా 2లో

రోడ్లపై చెత్త కనిపించకూడదు..

ట్రాఫిక్ ఆగకూడదు

నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని సీఎం వార్నింగ్



హైదరాబాద్, నవంబర్ 2 :

హైదరాబాద్‌ను 'క్లీన్ అండ్ ట్రాఫిక్ ఫ్రీ సిటీ'గా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. నగరంలో ఎక్కడా చెత్త కనిపించకూడదని, నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. క్యూర్ పరిధిలోని మూడు కమిషనరేట్‌లలో గ్రీన్ ట్యాంకర్ల సరఫరా పెంచాలన్నారు. జూబ్లీహిల్స్ నివాసంలో మున్సిపల్ అధికారులతో వివిధ అంశాలపై సీఎం రేవంత్ సమీక్ష నిర్వహించారు. ట్రాఫిక్ జామ్‌లు లేకుండా సిగ్నల్ రహిత జంక్షన్‌లకు ప్రణాళిక ..మిగతా 2లో



రైతులను ఆదుకోవడంలో

రేవంత్ విఫలం: హరీష్ రావు

వనపర్తి: నవంబర్ 2:

కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే పాలమూరు ప్రాంతంలో కరువు పరిస్థితులు ఏర్పడ్డాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు విమర్శించారు. శ్రీశైలం, జూరాల నుంచి అందుబాటులో ఉన్న కృష్ణా జలాలను పూర్తిస్థాయిలో వినియోగించకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో ఎనిమిదేళ్ల పాటు రెండు పంటలు పండిన ప్రాంతంలో ఈసారి తొలి పంట కూడా ఎండిపోయిందని అన్నారు.

"కృష్ణా నీటిని ఎత్తకుండా పాలమూరుకు కరువు తీసుకొచ్చారు. బీఆర్ఎస్ హయాంలో ఎప్పుడూ పంటలు ఎండిపోలేదు. ప్రజలకు భరోసా ఇవ్వడంలో రేవంత్ రెడ్డి ..మిగతా 2లో



హైదరాబాద్ మెట్రోకు నిధుల జోరు.. ఫేజ్-2కు రూ.150 కోట్లు

హైదరాబాద్, నవంబర్ 2 :

హైదరాబాద్‌లో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీకి పరిష్కారం చూపడంతో పాటు ప్రజా రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టుకు సంబంధించి నిధులు మంజూరు చేస్తూ పరిపాలనా ఉత్తర్వులు జారీ చేసింది. రెండో దశ (ఫేజ్-2) పనుల కోసం రూ.150 కోట్లు, ప్రభుత్వ రుణాల పద్దు కింద మరో రూ.125 కోట్లు కేటాయించింది. నగరంలో పెరుగుతున్న జనాభా, ఐటీ, పారిశ్రామిక రంగాల విస్తరణకు అనుగుణంగా మెట్రో నెట్‌వర్క్‌ను శివారు ప్రాంతాలకు విస్తరించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. తాజా నిధులతో ఫేజ్-2కు సంబంధించిన సాధ్యాసాధ్యాల అధ్యయనాలు, ప్రాథమిక పనులు, ప్రతిపాదిత కారిడార్ల సర్వేలు వేగవంతం కానున్నాయి.

భద్రాద్రి న్యూస్
www.bhadradrinews.com
తెలుగు దినపత్రిక
Follow : @bhadradrinews
మంగళవారం
3 । నవంబర్ । 2026
www.bhadradrinews.com
epaper.bhadradrinews.com
ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం

ఎల్‌నినోపై ప్రజలందరికీ అవగాహన అవసరం





రబీలో రైతులు ఆరుతడి పంటలు సాగు చేయాలి.

నీటిని, విద్యుత్ ను పొదుపుగా వినియోగించాలి.

జలసిరి కార్యక్రమాలతో నీటి సంరక్షణ.

జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్.

ఎల్ నినో పై రూపొందించిన షార్ట్ ఫిలిం విడుదల

జోగులాంబ గద్వాల జిల్లా :

ఎల్ నినో పై ప్రజలందరికీ పెద్ద ఎత్తున అవగాహన కలిగేలా సాంస్కృతిక సారధి కళాకారులు తమ పాటలతో తెలియజేస్తున్నారని, షార్ట్ ఫిలిం కూడా రూపొందించడంతో సామాజిక మాధ్యమాలలో పోస్ట్ చేసి విస్తృత ప్రచారం కల్పించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.ఉండవల్లి మండలం, కంచుపాడు గ్రామానికి చెందిన ఔత్సాహిక షార్ట్ ఫిలిం డైరెక్టర్ శేషు ఎల్ నినో పై రూపొందించిన షార్ట్ ఫిలింను కలెక్టర్ సోమవారం తన ఛాంబర్ లో విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ షార్ట్ ఫిలింను రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ ఉన్నతాధికారులకు కూడా పంపించాలని తద్వారా రాష్ట్రమంతటా అన్ని జిల్లాలలో విస్తృత ప్రచారం కల్పించవచ్చన్నారు. ప్రభుత్వం జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించిందని, ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ప్రజలకు జల సంరక్షణపై పెద్ద ఎత్తున అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. రబీ సీజన్లో రైతులు తమ బోరు, బావుల్లో నీటి లభ్యత ఆధారంగా ఆరుతడి పంటలను సాగు చేయవచ్చన్నారు. పప్పు దినుసులు, కూరగాయలు వంటి స్వల్పకాలిక పంటలపై దృష్టి సారించాలన్నారు. స్ప్రింక్లర్లు, డ్రిప్ ఇరిగేషన్ ద్వారా పండించే పంటలపై ఆసక్తి చూపితే తక్కువ నీటితోనే పంటలు పండించవచ్చన్నారు. నీటిని రీసైక్లింగ్ చేసే విధానాలపై మొగ్గు చూపితే, పెరటి తోటల్లోని మొక్కలకు ఆ నీటిని వినియోగించవచ్చన్నారు. ప్రతి ఇంటిపై వర్షపు నీటిని ఒడిసి పట్టేందుకు చిన్న సంపులు ఏర్పాటు చేసుకుని, ఇతర మార్గాల ద్వారా ఆ నీటిని గృహ అవసరాలకు వినియోగించేందుకు కృషి చేయాలన్నారు. విబిజి రాంజీలో జలసిరి కార్యక్రమాల్లో భాగంగా పంట కుంటలు, ఇంకుడు గుంతల నిర్మాణం పెద్ద ఎత్తున చేపట్టాలని తద్వారా భూగర్భ జలాలను అభివృద్ధి చేసేందుకు ఆస్కారం ఉందన్నారు. విద్యుత్తు కూడా పొదుపుగా వినియోగించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జూలై వరకు ఎల్ నినో ప్రభావం ఉంటున్నందున నీరు, విద్యుత్ పొదుపు విషయంలో ప్రజలు ప్రభుత్వానికి సహకరించేలా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. ఎల్ నినో ప్రభావంతో వచ్చే 8 నెలల పాటు ప్రజలు నీటి కొరతను అధిగమించేందుకు ఇలాంటి షార్ట్ ఫిలిమ్స్ దోహదపడతాయని రూపొందించిన నిర్వాహకులను ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో డిఏఓ వీరప్ప, ఉద్యాన అధికారి రాజ్ కుమార్, షార్ట్ ఫిలింకు సహకారం అందించిన లక్ష్మణ్, శేషన్ గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ నుంచి కూడా కాంగ్రెస్‌ను తరిమికొట్టాలి: అమిత్ షా

మొదటి పేజీ తరువాయి...

అమిత్ షా ప్రసంగించారు. ఈ కార్యక్రమం దేశవ్యాప్తంగా ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై కాంగ్రెస్, ఇండియా కూటమి చేస్తున్న విమర్శలకు బీజేపీ ఇచ్చిన ప్రతివ్యూహంలో భాగంగా జరిగింది. ఈవీఎంలపై రాహుల్ గాంధీ చేస్తున్న విమర్శలపైనా అమిత్ షా స్పందించారు. ఈవీఎంల వల్లే ఎన్నికల్లో అక్రమాలు జరుగుతున్నాయన్నది కాంగ్రెస్ వాదన అయితే, తెలంగాణలో కాంగ్రెస్ ఎలా గెలిచిందని ప్రశ్నించారు. కేరళం, హిమాచల్‌ప్రదేశ్‌లో ఆ పార్టీ విజయాలు ఎలా సాధ్యమయ్యాయని నిలదీశారు. ప్రధానిగా మోదీ 12 ఏళ్లు పూర్తి చేసుకున్నారని, ఆయన పాలనపై ఎలాంటి అవినీతి ఆరోపణలు లేవని అన్నారు. మోదీ ఇచ్చిన హామీలు అమలయ్యాయని పేర్కొంటూ, తెలంగాణలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు మాత్రం అమలుకు నోచుకోవడం లేదని విమర్శించారు.

దేశంలోని అనేక రాష్ట్రాల్లో కాంగ్రెస్ అధికారం కోల్పోతోందని అమిత్ షా వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీని కాపాడటం రాహుల్ గాంధీ వల్ల సాధ్యం కాదన్నారు. తెలంగాణలోనూ బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

అంతకుముందు సోమవారం మధ్యాహ్నం అమిత్ షా బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్నారు. కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు సహా పలువురు పార్టీ నేతలు ఆయనకు స్వాగతం పలికారు. అక్కడి నుంచి చార్మినార్ సమీపంలోని భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆయనకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. కిషన్‌రెడ్డి, రాంచందర్‌రావుతో పాటు ఎంపీ రఘునందన్‌రావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అనంతరం ఐటీసీ కాకతీయ హోటల్‌కు చేరుకున్న అమిత్ షా అక్కడ భోజన విరామం తీసుకున్నారు. పార్టీ ముఖ్య నేతలతో పాటు పలువురు ప్రముఖులతోనూ సమావేశమయ్యారు. అనంతరం ప్రారంభమైన పాదయాత్రలో కిషన్‌రెడ్డి, కేంద్ర మంత్రి బండి సంజయ్, రాంచందర్‌రావు, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈ పాదయాత్రకు 'లోకతంత్ర బచావో – అరాచకత హటావో' (ప్రజాస్వామ్యాన్ని రక్షిద్దాం -- అరాచకవాదాన్ని అంతం చేద్దాం) అనే పేరు పెట్టింది. ఢిల్లీలో నిన్న కాంగ్రెస్, ఇండియా కూటమి నేతలు నిర్వహించిన 'ఓట్ చోరీ' వ్యతిరేక ర్యాలీకి ప్రతిగా, ఎస్ఐఆర్‌పై విపక్షాలు చేస్తున్న ఆరోపణలను తిప్పికొట్టడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని బీజేపీ నేతలు ప్రకటించారు. హైదరాబాద్ పాదయాత్రతో పాటు దేశంలోని ఇతర ప్రాంతాల్లోనూ ఇలాంటి కార్యక్రమాలు చేపట్టాలని పార్టీ ప్రణాళిక రూపొందించింది.

రోడ్లపై చెత్త కనిపించకూడదు..

ట్రాఫిక్ ఆగకూడదు

మొదటి పేజీ తరువాయి...

చేయాలని అధికారులను ఆదేశించారు.

నగరాన్ని క్లీన్ అండ్ ట్రాఫిక్ ఫ్రీగా మార్చాలి

భాగ్యనగరాన్ని పరిశుభ్రమైన, ట్రాఫిక్ జామ్‌లు లేని సిటీగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. నగరంలో ఎక్కడా చెత్త కనిపించకూడదని, చెత్త సేకరణపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని అధికారులకు సూచించారు. రోజూ ఇంటింటి చెత్త సేకరణ జరిగేలా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. నిర్లక్ష్యం వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ ఆదేశించారు.

నిర్మాణ వ్యర్థాల తరలింపునకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. ఇండస్ట్రియల్ ఏరియాల్లో చెత్త సేకరణకు పారిశ్రామిక వాడల అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. నగరంలో నిర్మాణ పనులు, పార్కుల నిర్వహణ, ల్యాండ్ స్కేపింగ్, గార్డెనింగ్‌తో పాటు ఇతర పనులకు ఎస్టీపీల్లో శుద్ధి చేసిన నీటిని సరఫరా చేసే ఉద్దేశంతో గ్రీన్ ట్యాంకర్స్‌ను సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని సీఎం అధికారులకు సూచించారు.

గ్రీన్ వాటర్ సరఫరా మరింత విస్తరించాలి

నిర్మాణ రంగం, గ్రీనరీ మెయింటెనెన్స్, పార్కుల అభివృద్ధి వంటి అవసరాలకు తాగునీటిని ఉపయోగిస్తున్నారని, దీనికి బదులుగా ఎస్టీపీల్లో శుద్ధి చేసిన నీటిని వినియోగించడం ద్వారా తాగునీటిని ఆదా చేయవచ్చని సీఎం అభిప్రాయపడ్డారు. జలమండలి తొలివిడతలో 19 ఎస్టీపీ నుంచి 28 గ్రీన్ వాటర్ ట్యాంకర్ల ద్వారా సేవలు అందుబాటులోకి తీసుకొచ్చిందని గుర్తు చేశారు. జీహెచ్ఎంసీతో పాటు సీఎంసీ, ఎంఎంసీ పరిధిలో గ్రీన్ వాటర్ సరఫరాను మరింత విస్తరించాలని సీఎం సూచించారు. నగరంలో ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టి ట్రాఫిక్ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

సిగ్నల్ ఫ్రీ ట్రాఫిక్ వ్యవస్థకు ప్రణాళికలు

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. సిగ్నల్ ఫ్రీ వ్యవస్థను తీసుకురావడానికి అవసరమైన చోట అండర్‌పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్‌లను నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. సాధ్యమైనంత వరకు సిగ్నళ్ల వద్ద ట్రాఫిక్ నిలిచిపోకుండా వాహనాల రాకపోకలు నిరంతరాయంగా కొనసాగేలా చూడాలన్నారు. సమీక్షా సమావేశంలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ఉన్నతాధికారులు మాణిక్ రాజ్, సర్ఫరాజ్ అహ్మద్, జి. సృజన, తదితరులు పాల్గొన్నారు.

విద్యా వృద్ధి లక్ష్యంగా ముందుకు వెళ్తున్నాం: ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి







ముల్కలపల్లి పాఠశాలలో నూతన తరగతి గదులు ప్రారంభించిన గద్వాల ఎమ్మెల్యే

స్వర్గీయ మందడి భూపాల్ రెడ్డి ఘనంగా నివాళి అర్పణ!

గద్వాల జిల్లా, నవంబర్ 2:

ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు పెంపొందించి విద్యావృద్ధి లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని గద్వాల ఎమ్మెల్యే మండల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. సోమవారంగద్వాల మండలం ముల్కలపల్లి గ్రామంలో స్వర్గీయ మందడి భూపాల్ రెడ్డి జ్ఞాపకార్థం పునర్ నిర్మించిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నూతన తరగతి గదులను గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ప్రారంభించారు.ముందుగా స్వర్గీయ మందడి భూపాల్ రెడ్డి చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం భూపాల్ రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని అందరూ రెండు నిమిషాలు మౌనం పాటించారు.అనంతరం పాఠశాల విద్యార్థులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా నోట్ పుస్తకాలు మరియు పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గద్వాల ఎమ్మెల్యే మాట్లాడుతూ..."ముల్కలపల్లి గ్రామంలో స్వర్గీయ మందడి భూపాల్ రెడ్డి జ్ఞాపకార్థం ఈ పాఠశాల తరగతి గదులను అన్ని హంగులతో పునర్నిర్మించడం అభినందనీయం అని కొనియాడారు. చేతికొచ్చిన కొడుకు చిన్న వయసులోనే మరణించడం ఆ తల్లిదండ్రులకు తీరని లోటు అని, ఇలాంటి బాధ ఏ తల్లిదండ్రులకు రాకూడదని భగవంతుడిని కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు. భూపాల్ రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ, వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బోయ రాముడు, మండల విద్యాధికారి శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీపీ విజయ్, మాజీ కౌన్సిలర్ మురళి, నాయకులు రమేష్ నాయుడు, లక్ష్మీకాంత్ రెడ్డి, సాయి శ్యామ్ రెడ్డి, యోగి, పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు, మందడి కుటుంబ సభ్యులు, గ్రామస్థులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కదంతొక్కిన

కాషాయ శ్రేణులు

మొదటి పేజీ తరువాయి...

చారిత్రక చార్మినార్ వద్ద ఉన్న భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఇతర బీజేపీ నేతలు ఘన స్వాగతం పలికారు. పాదయాత్ర నేపథ్యంలో బషీర్‌బాగ్, నాంపల్లి, అబిడ్స్, కోఠి, అఫ్జల్‌గంజ్ సహా పలు ప్రాంతాల్లో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించి, వాహనాలను దారి మళ్లించారు.

సూర్య ఘర్ పథకంతో 65 లక్షల ఇళ్లకు ప్రయోజనం

మొదటి పేజీ తరువాయి...

అంతర్జాతీయ పరిణామాల ప్రభావం దేశ ఆర్థిక వ్యవస్థపై మరీ ఎక్కువగా పడకుండా అడ్డుకోగలిగామని ప్రధాని వివరించారు. ఇదే సమయంలో పునరుత్పాదక ఇంధన రంగంలో భారత్ సాధించిన పురోగతిని మోదీ వివరించారు. భారత స్వచ్ఛ ఇంధన రంగాన్ని కేవలం హైడ్రో, సోలార్, విండ్, న్యూక్లియర్ విద్యుత్ వనరులకే పరిమితం చేయట్లేదని, గ్రీన్ హైడ్రోజన్ రంగంలోనూ ముందడుగు వేయడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు.

మొత్తం విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంలో సగానికిపైగా వాటాను నాన్ ఫాసిల్ ఇంధన వనరుల ద్వారా సాధించాలనే 'పారిస్ ఒప్పందం' లక్ష్యాన్ని నిర్దేశించిన సమయం కంటే ఐదేళ్ల ముందుగానే, అంటే 2025 నాటికే భారతదేశం విజయవంతంగా చేరుకుందని ఆయన వెల్లడించారు. ప్రస్తుతం దేశ మొత్తం విద్యుత్ సామర్థ్యంలో ఈ శిలాజయేతర వనరుల వాటానే 50 శాతానికిపైగా ఉందని పేర్కొన్నారు. 2030 నాటికి 500 గిగావాట్ల పునరుత్పాదక ఇంధనాన్ని సాధించాలనే 'జూన్26' లక్ష్యం దిశగా భారత్ అడుగులు వేస్తూ- ఇప్పటికే దాదాపు 300 గిగావాట్ల మైలురాయిని చేరుకుందని ప్రధాని స్పష్టం చేశారు. రానున్న 10-11 ఏళ్లలో దేశీయంగా మరో 500 గిగావాట్ల శిలాజయేతర విద్యుత్ సామర్థ్యాన్ని అదనంగా జోడించడమే భారతదేశ తదుపరి లక్ష్యమని మోదీ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

సూర్య ఘర్ పథకంతో 65 లక్షల ఇళ్లకు ప్రయోజనం

ఇళ్లపై సోలార్ విద్యుత్ వ్యవస్థల ఏర్పాటుకు ఉద్దేశించిన పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన పురోగతిని మోదీ వివరించారు. 2024 ఫిబ్రవరిలో ప్రారంభించిన ఈ పథకం ద్వారా కోటి కుటుంబాలకు ప్రయోజనం కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. గత రెండేళ్లలో 65 లక్షలకుపైగా ఇళ్లకు సోలార్ విద్యుత్ సదుపాయం అందిందని తెలిపారు. దీంతో ఆయా కుటుంబాల విద్యుత్ బిల్లులు సుమారు 76 శాతం తగ్గాయని చెప్పారు. ఇదే సమయంలో పీఎం- కుసుమ్ పథకం కింద 30 లక్షలకుపైగా రైతులకు సోలార్ విద్యుత్ వ్యవస్థల ద్వారా ప్రయోజనం కలుగుతోందని ప్రధాని పేర్కొన్నారు. దీని కింద ఒక్కో రైతుకు ఏడాదికి సుమారు రూ. 1 లక్ష వరకు ఆదా అవుతున్నట్లు అంచనా వేశారు. అలానే 44 వేలకుపైగా ప్రభుత్వ భవనాలపై ఏర్పాటు చేసిన సోలార్ వ్యవస్థల వల్ల ఏటా దాదాపు రూ. 700 కోట్ల మేర ఆదా అవుతుందని వెల్లడించారు.

రైతులను ఆదుకోవడంలో

రేవంత్ విఫలం:

మొదటి పేజీ తరువాయి...

విఫలం అయ్యారు. కాంగ్రెస్ నిర్లక్ష్యంతోనే రాష్ట్రంలో కరెంట్ కష్టాలు వచ్చాయి. కాంగ్రెస్ చేసిన పాపం ప్రజలకు శాపంగా మారింది. ప్రజల సంక్షేమం సీఎం రేవంత్‌కు పట్టదని, కాంగ్రెస్ పాలనలో రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు" అని హరీష్ రావు మండిపడ్డారు. అంతేకాదు కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా గతంలో 50 టీఎంసీల నీటిని ఎత్తిపోస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 18 టీఎంసీలకే పరిమితమైందని విమర్శించారు. శ్రీశైలం, జూరాల నుంచి వెంటనే నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కరువుతో పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం, యాసంగి రైతుబంధు అందించాలని ఆయన కోరారు. కరువు మండలాల ప్రకటనకే ప్రభుత్వం పరిమితమైందని, కరువు పరిస్థితులను పరిశీలించేందుకు తక్షణమే కేంద్ర బృందాన్ని పంపించాలని డిమాండ్ చేశారు. రైతులకు ధైర్యం చెప్పేందుకే తాము పర్యటిస్తున్నామని తెలిపారు.

మంత్రి పదవి ఇవ్వలేదు..

నిధులూ రావడం లేదు..

మొదటి పేజీ తరువాయి...

చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్‌లో మరోసారి చర్చకు దారితీశాయి.

గట్టుప్పల్ మండలంలో పర్యటించిన సందర్భంగా రాజగోపాల్‌రెడ్డి మంత్రి పదవిపై మాట్లాడారు. పదవి ఇస్తామని చెప్పి మోసం చేశారని, అయినప్పటికీ మనసు చంపుకొని ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రిని కలిసినా ప్రయోజనం లేకుండా పోయిందని అన్నారు. తనకు మంత్రి పదవి ఇస్తే ఎక్కడికో వెళ్లిపోతాననే ఉద్దేశంతోనే ఇవ్వడం లేదని వ్యాఖ్యానించారు.

నియోజకవర్గ అభివృద్ధికి నిధులు విడుదల చేయాలని కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని రాజగోపాల్‌రెడ్డి విమర్శించారు. అధికార పార్టీ ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ నిధుల కోసం ప్రతిపక్ష ఎమ్మెల్యేలాగా పోరాడాల్సి వస్తోందన్నారు. రోడ్ల నిర్మాణానికి టెండర్లు పిలుస్తున్నా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించడం లేదని, దీంతో పనులు మధ్యలోనే నిలిచిపోతున్నాయని చెప్పారు. ప్రస్తుత పనులకే నిధులు ఇవ్వకపోతే కొత్త పనులు ఎలా చేపడతారని ప్రశ్నించారు. జీతాలు, రైతు భరోసా వంటి పథకాలకు నిధుల కేటాయింపులోనూ ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోందని వ్యాఖ్యానించారు.

మునుగోడు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి జరగకపోతే పదవులను పట్టుకుని వేలాడబోనని, అవసరమైతే ఎమ్మెల్యే పదవిని వదులుకోవడానికి కూడా సిద్ధమని స్పష్టం చేశారు. గతంలో తాను కష్టపడి గెలిపించిన పలువురు నేతలు తనను మోసం చేశారని ఆరోపించారు. ఎవరికీ భయపడేది లేదని, రాజీపడే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు.

రాజగోపాల్‌రెడ్డి తాజా వ్యాఖ్యలతో సీఎం రేవంత్‌రెడ్డితో ఆయనకు విభేదాలు మరోసారి తెరపైకి వచ్చాయి. గతంలోనూ ఇద్దరి మధ్య దూరం పెరిగిందనే ప్రచారం జరిగింది. ఆ తర్వాత ముఖ్యమంత్రి పాల్గొన్న సభకు రాజగోపాల్‌రెడ్డి హాజరుకావడంతో పరిస్థితులు సద్దుమణిగాయని కాంగ్రెస్ వర్గాలు భావించాయి. అయితే రేడియల్ రోడ్ల టెండర్ల వ్యవహారం మళ్లీ వివాదానికి కారణమైంది. తన కుటుంబానికి చెందిన కంపెనీని ప్రభుత్వం పక్కన పెట్టిందని ఆరోపిస్తూ ఆయన న్యాయపోరాటం చేస్తున్నారు.

ఈ పరిణామాల నేపథ్యంలో తాజా వ్యాఖ్యలు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకా? లేక సీఎం రేవంత్‌రెడ్డితో మరోసారి నేరుగా తలపడేందుకు సంకేతమా? అన్న చర్చ మొదలైంది. ఇటీవల నిధుల విషయంలో జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ తీవ్రంగా స్పందించిన నేపథ్యంలో, రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలపై పార్టీ నాయకత్వం ఎలా వ్యవహరిస్తుందో చూడాలి.

మతసామరస్యానికి మసీదు సందర్శన కార్యక్రమాలు దోహదం

- శాంతి, ఐక్యత, సోదరభావమే సమాజ అభివృద్ధికి పునాది

- మానవత్వం, ప్రేమ, సేవా భావమే ఇస్లాం ప్రధాన సందేశం

: డిప్యూటీ మేయర్ ఎస్. లలితకుమారి



కొత్తగూడెం అర్బన్, నవంబర్ 2 (భద్రాద్రిన్యూస్):
భిన్న మతాలు, విభిన్న సంస్కృతులు కలిగిన సమాజంలో ఐక్యత, శాంతి, సామరస్యం, సోదరభావాన్ని పెంపొందించేందుకు మసీదు సందర్శన వంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఎస్. లలితకుమారి అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం పట్టణంలోని కూలీలైన్‌లో జమియత్ అహ్లే హదీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'మా మసీదు సందర్శన' కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముస్లిం మతపెద్దలతో మర్యాదపూర్వకంగా మాట్లాడి, మసీదులో నిర్వహించిన కార్యక్రమాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఇస్లాం మతంలోని ప్రధాన బోధనలు, మహమ్మద్ ప్రవక్త అందించిన మానవతా సందేశాలు, ఇస్లాం ఐదు ప్రధాన ఆచారాలపై నిర్వాహకులు సమగ్ర అవగాహన కల్పించారు. అల్లాహ్‌పై విశ్వాసం, ఐదు పూటల నమాజ్, జకాత్ ద్వారా పేదలకు సహాయం, రంజాన్ మాసంలో రోజా, సామర్థ్యం ఉన్నవారు హజ్ యాత్ర చేయడం వంటి ఆచారాల ప్రాధాన్యతను వివరించారు. అలాగే కులమతాలు, ధనిక, పేద అనే తారతమ్యాలు లేకుండా ప్రతి ఒక్కరినీ గౌరవించడం, తల్లిదండ్రులను ఆదరించడం, పొరుగువారితో ప్రేమగా మెలగడం, పేదలు, అనాథలకు సహాయం చేయడం, నిజాయితీ, క్షమాగుణం, సహనంతో జీవించడం వంటి విలువలను వివరించారు. ఇస్లాం మతం మానవత్వం, ప్రేమ, దయ, శాంతి, సమానత్వం, సేవ, నిజాయితీతో కూడిన జీవన విధానాన్ని బోధిస్తుందని ఈ సందర్భంగా తెలియజేశారు. మతాల మధ్య పరస్పర అవగాహన పెరిగినప్పుడే సమాజంలో సుహృద్భావ వాతావరణం నెలకొంటుందని, ఇలాంటి కార్యక్రమాలు ప్రజల మధ్య స్నేహసంబంధాలను మరింత బలోపేతం చేస్తాయని డిప్యూటీ మేయర్ పేర్కొన్నారు.

ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకొని ఉన్నత స్థాయికి ఎదగాలి

- ఉచిత వృత్తి శిక్షణ తరగతులను ప్రారంభించిన సేవా అధ్యక్షురాలు గీతారాణి వెంకటరమణ



కొత్తగూడెం సింగరేణి, నవంబర్ 2 (భద్రాద్రిన్యూస్):
మహిళలు వృత్తి విద్యా కోర్సులను సద్వినియోగం చేసుకొని నైపుణ్యాలను పెంపొందించుకోవడంతో పాటు ఆర్థికంగా స్వావలంబన సాధించాలని సింగరేణి కొత్తగూడెం ఏరియా సేవా అధ్యక్షురాలు శ్రీమతి సీహెచ్. గీతారాణి వెంకటరమణ పిలుపునిచ్చారు. సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో రుద్రంపూర్, రామవరం, గౌతంపూర్ ప్రాంతాల మహిళలకు నిర్వహించనున్న ఉచిత వృత్తి శిక్షణ తరగతులను సోమవారం రుద్రంపూర్‌లోని సీఈఆర్ క్లబ్‌లో ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సింగరేణి ఉద్యోగుల కుటుంబాలకు చెందిన మహిళలు, ప్రాజెక్టు ప్రభావిత ప్రాంతాలు, పరిసర ప్రాంతాల మహిళలు ఆర్థికంగా ఎదిగి ఉపాధి అవకాశాలు పొందాలనే లక్ష్యంతో సేవా సమితి వివిధ వృత్తి విద్యా కోర్సులను నిర్వహిస్తోందన్నారు. మహిళలు శిక్షణ తరగతులకు క్రమం తప్పకుండా హాజరై, శ్రద్ధతో నైపుణ్యాలను నేర్చుకొని స్వయం ఉపాధి ద్వారా అభివృద్ధి చెందాలని సూచించారు. ఈ విడతలో రుద్రంపూర్ మహిళలకు ఉచిత టైలరింగ్, రామవరం మహిళలకు ఫ్యాషన్ డిజైనింగ్, మగ్గం వర్క్, గౌతంపూర్ మహిళలకు బ్యూటీషియన్ కోర్సుల్లో శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. మూడు నెలల పాటు కొనసాగే ఈ శిక్షణ కార్యక్రమాలను మహిళలు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం 2025--26 ఆర్థిక సంవత్సరంలో వివిధ వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళా లబ్ధిదారులకు సేవా అధ్యక్షురాలు గీతారాణి వెంకటరమణ చేతుల మీదుగా శిక్షణ ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. అదేవిధంగా ప్రస్తుతం శిక్షణ పొందుతున్న మహిళలకు ప్రోత్సాహకంగా శ్రీమతి పార్వతి మదన్మోహన్ ఒక మగ్గం స్టాండ్‌ను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో డీవైపీఎం జి. హరీష్, సీనియర్ పీఓ ఎం. మురళి, సేవా కోఆర్డినేటర్ సీహెచ్. సాగర్, సేవా కార్యదర్శి అనిత, శిక్షకులు, సేవా సమితి సభ్యులు, శిక్షణ పొందుతున్న మహిళా అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.



సింగరేణిలో డిజిటల్ విప్లవం.. ఇక ముఖచిత్రంతోనే హాజరు!

- కొత్తగూడెం ఏరియాలో ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్ ట్రయల్ రన్ విజయవంతం

- పారదర్శకత, సమయపాలనకు పెద్దపీట.. త్వరలో అన్ని ఏరియాలకు విస్తరణ





కొత్తగూడెం సింగరేణి , నవంబర్ 2 (భద్రాద్రి న్యూస్):
సాంకేతిక పరిజ్ఞానం వినియోగంలో ముందంజలో ఉండే సింగరేణి కాలరీస్ సంస్థ మరో కీలక అడుగు వేసింది. ఉద్యోగుల హాజరు నమోదులో ఆధునిక సాంకేతికతను ప్రవేశపెడుతూ ముఖచిత్ర గుర్తింపు ఆధారిత హాజరు (ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్) విధానానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా సోమవారం కొత్తగూడెం ఏరియాలో ప్రయోగాత్మకంగా ఈ విధానం ట్రయల్ రన్‌ను విజయవంతంగా ప్రారంభించింది. ఇప్పటికే సింగరేణిలోని కొన్ని జనరల్ మేనేజర్ కార్యాలయాల్లో బయోమెట్రిక్ హాజరు విధానం అమల్లో ఉన్నప్పటికీ, ఒక ఏరియా పరిధిలోని గనులు, అన్ని విభాగాల్లోనూ ముఖచిత్ర ఆధారిత హాజరు విధానాన్ని అమలు చేయడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఈ నూతన విధానం ద్వారా ఉద్యోగుల హాజరు మానవ ప్రమేయం లేకుండా సాంకేతిక పరిజ్ఞానంతో నమోదు కానుంది. తద్వారా హాజరు నమోదులో పారదర్శకత పెరగడంతో పాటు ఉద్యోగుల్లో సమయపాలన, విధి నిర్వహణలో క్రమశిక్షణ పెంపొందుతుందని యాజమాన్యం భావిస్తోంది. అంతేకాకుండా సంస్థ ఉత్పాదకత పెంపునకు ఈ విధానం దోహదపడుతుందని ఆశిస్తోంది. సింగరేణి సంస్థలో సుమారు 40 వేల మంది కార్మికులు పనిచేస్తుండగా, కొత్తగూడెం ఏరియా పరిధిలో దాదాపు 1,600 మంది విధులు నిర్వహిస్తున్నారు. పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించిన ఈ ట్రయల్ రన్ తొలిరోజే ఎలాంటి సాంకేతిక ఆటంకాలు లేకుండా విజయవంతం కావడంతో ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. కొత్తగూడెం ఏరియాలో ప్రయోగాత్మక అమలు ఫలితాలను పరిశీలించిన అనంతరం సింగరేణిలోని ఇతర ఏరియాల గనులు, విభాగాల్లోనూ ఈ ఆధునిక హాజరు విధానాన్ని దశలవారీగా అమలు చేయాలని యాజమాన్యం నిర్ణయించింది.

ప్రతి దరఖాస్తును గడువులోగా పరిష్కరించాలి: కలెక్టర్ అంకిత్

- పెండింగ్ ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి.. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి రావొద్దు



భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 2 (భద్రాద్రి న్యూస్):
ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహించకుండా, ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ పదేపదే తిరగాల్సిన పరిస్థితి రాకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. సోమవారం కొత్తగూడెంలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ)లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ అంకిత్, అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందనతో కలిసి ప్రజల నుంచి వివిధ సమస్యలపై అర్జీలు, ఫిర్యాదులను స్వీకరించారు. భూ సమస్యలు, రెవెన్యూ అంశాలు, సంక్షేమ పథకాలు, పింఛన్లు, గృహాలు, ఉపాధి, మౌలిక సదుపాయాలకు సంబంధించిన సమస్యలను ప్రజలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అశ్వారావుపేట మండలం నందిపాడుకు చెందిన బత్తుల జానకమ్మ తనకు గతంలో అంత్యోదయ అన్న యోజన (ఏఏవై) కింద రేషన్ అందేదని, ప్రస్తుతం నిలిపివేశారని తెలిపారు. తాను వితంతువునని, సంతానం కూడా లేదని, తిరిగి ఏఏవై రేషన్ కార్డు మంజూరు చేయాలని కోరగా డీసీఎస్ఓకు పంపించారు. లక్ష్మీదేవిపల్లి మండలం సాటివారిగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని చాతకొండ ఎస్సీ కాలనీకి చెందిన మేక రజని తన భర్త, ఇద్దరు పిల్లలతో అద్దె ఇంట్లో నివసిస్తున్నామని, రోజువారీ కూలి పనులు సరిగా లభించక కుటుంబ పోషణ భారంగా మారిందని, తమకు ఇంటి స్థలం మంజూరు చేయాలని కోరారు. ఈ అర్జీని తహసీల్దార్‌కు ఎండార్స్ చేశారు.కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని సఫాయి బస్తీకి చెందిన మహమ్మద్ జరీనా బేగం తాను పోలియో బాధితురాలినని, 2023లో నిర్వహించిన లాటరీలో డబుల్ బెడ్‌రూమ్ ఇంటి ప్లాట్ నంబర్ 602 కేటాయించారని తెలిపారు. అద్దె భారం కారణంగా మరో ప్రాంతానికి మారిన సమయంలో సరైన సమాచారం అందక తనకు కేటాయించిన ఇంటిని అధికారులు రద్దు చేశారని, తిరిగి ఆ ఇంటిని మంజూరు చేయాలని కోరారు. ఈ దరఖాస్తును పీడీ హౌసింగ్‌కు కలెక్టర్ ఎండార్స్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటు హక్కుపై కాంగ్రెస్ దృష్టి!

- 19వ డివిజన్‌లో ఇంటింటా ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు

- అర్హులైన ప్రతి పట్టభద్రుడూ ఓటరుగా నమోదు చేసుకోవాలి:

- మాజీ కార్పొరేటర్ చామకూరి వెంకటనారాయణ



ఖమ్మం ప్రతినిధి , నవంబర్ 2 (భద్రాద్రి న్యూస్): ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలనే లక్ష్యంతో 19వ డివిజన్‌లో ఇంటింటా పట్టభద్రుల ఓటర్ల నమోదు కార్యక్రమం చురుగ్గా కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ మాజీ కార్పొరేటర్ చామకూరి వెంకటనారాయణ డివిజన్ పరిధిలోని ఇళ్లను సందర్శిస్తూ డిగ్రీ పూర్తి చేసిన అర్హులైన పట్టభద్రులను గుర్తించి, ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా వెంకటనారాయణ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత కీలకమని, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ అభిప్రాయాన్ని వెల్లడించేందుకు అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. పట్టభద్రులు తమ ఓటు హక్కు ప్రాధాన్యతను గుర్తించి, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భాస్కర్, పాషా, శివరాం, కొంగర రామారావు, గోపాల్, లక్కీ తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో సత్తా చాటిన హేమచంద్రాపురం విద్యార్థినులు

- అఖిల భారత స్థాయిలో మూడు పతకాలు సాధించి జిల్లాకు కీర్తి ప్రతిష్ఠలు







లక్ష్మీదేవిపల్లి, నవంబర్ 2 భద్రాద్రిన్యూస్ : అఖిల భారత స్థాయి కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో లక్ష్మీదేవిపల్లి మండలం హేమచంద్రాపురం పీఎం శ్రీ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థినులు అద్భుత ప్రతిభ కనబరిచి మూడు పతకాలు సాధించారు. ఎం.మోక్షశ్రీ బంగారు పతకంతో ఆల్ ఇండియా మొదటి స్థానం,ఆర్. సాత్విక,బి.సాత్విక రజత పతకాలతో రెండో స్థానాలు సాధించారు. విద్యార్థినులకు ప్రత్యేక శిక్షణ అందించిన కరాటే మాస్టర్ ఎం.లతను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ధరావత్ థావూర్య, ఉపాధ్యాయులు అభినందించారు. విద్యార్థినుల విజయంపై హేమచంద్రాపురం, కారుకొండరామవరం గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని పాఠశాల సిబ్బంది ఆకాంక్షించారు.

జాతీయ కరాటే ఛాంపియన్‌షిప్‌లో త్రివేణి విద్యార్థుల పతకాల పంట



ఖమ్మం ప్రతినిధి, నవంబరు 2 (భద్రాద్రిన్యూస్):-
ఖమ్మంలోని వర్తక సంఘ భవనంలో ఆదివారం (నవంబర్ 1) నిర్వహించిన శ్రీమతి కేసరిచందర్ మెమోరియల్ 32వ నేషనల్ ఆఫ్‌లైన్ అండ్ ఆన్‌లైన్ కరాటే ఛాంపియన్‌షిప్--2026లో త్రివేణి టాలెంట్ స్కూల్, ఖమ్మం విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి రెండు స్వర్ణ పతకాలు, మూడు రజత పతకాలు సాధించి పాఠశాలకు కీర్తి ప్రతిష్ఠలు తీసుకొచ్చారు. సుమన్ షోటోకాన్ స్పోర్ట్స్ కరాటే డూ అకాడమీ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ జాతీయస్థాయి పోటీల్లో వివిధ విభాగాల్లో పాల్గొన్న త్రివేణి విద్యార్థుల ప్రతిభను చాటుకున్నారు.
ప్రథమ స్థానం -- స్వర్ణ పతకాలు:
ఎ. యోగిత -- కటా విభాగం, 6వ తరగతి,
డి. విష్ణేశ్వర్ రెడ్డి -- కుమిటే విభాగం, 7వ తరగతి
ద్వితీయ స్థానం -- రజత పతకాలు:
ఎన్. భవిష్య -- కటా విభాగం, 5వ తరగతి
పి. బెనోని -- కటా విభాగం, 7వ తరగతి
కె. భవిష్య -- కటా విభాగం, 5వ తరగతి.
ఈ సందర్భంగా త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్ డా. గొల్లపూడి వీరేంద్ర చౌదరి, ప్రిన్సిపాల్ శ్రీ రాజేంద్ర ప్రసాద్ విజేతలను అభినందిస్తూ, విద్యతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు జాతీయస్థాయిలో రాణించడం పాఠశాలకు గర్వకారణమని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.
విద్యార్థులకు నిరంతరం శిక్షణనిస్తూ ఈ విజయాలకు మార్గదర్శకులైన కరాటే కోచ్ వీరన్నను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో సి.ఆర్.ఓ కాట్రగడ్డ మురళికృష్ణ, వైస్ ప్రిన్సిపాల్స్ స్వప్న, ముస్తఫా, క్యాంపస్ ఇంచార్జ్ విక్టర్ చార్లెస్, ట్రాన్స్‌పోర్ట్ ఇంచార్జ్ సందీప్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని విజేతలను అభినందించారు.

దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

- ప్రజావాణిలో ప్రజల అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్



ఖమ్మం ప్రతినిధి , నవంబర్- 02 (భద్రాద్రిన్యూస్): ప్రజా వినతుల దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో
జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు. ఖమ్మం అర్బన్ మండలం కైకొండాయిగూడెం గ్రామానికి చెందిన కే.రవీంద్ర బాబు సర్వే నెంబర్ 230 లో ఉన్న భూమి సర్వే చేసి రికార్డు మార్పు చేయగలరని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, తహసిల్దార్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఏదులాపురం పట్టణానికి చెందిన పలువురు మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణలో ప్రభుత్వ ప్రోటోకాల్ ఉల్లంఘిస్తూ ఎన్నికైన ప్రజాప్రతినిధులను అవమానిస్తున్నారని వీటిని సవరించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఏదులాపురం మున్సిపల్ కమీషనర్ కు రాస్తూ నిబంధనలు ప్రకారం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు కూసుమంచి మండలం తురకగూడెం గ్రామ పంచాయతీ సర్పంచ్ బుర్ర కృష్ణ తమ గ్రామంలో కొమ్ము ఇందిరమ్మకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించడం జరిగిందని దురదృష్టవశాత్తు కుటుంబ సభ్యులందరూ మరణించినట్లు తమ దృష్టికి వచ్చిందని, ఆ ఇంటికి చట్టబద్ధమైన హక్కు దారులు ఎవరైనా ఉన్నారు విషయాన్ని పరిశీలించాలని, చట్టపరమైన హక్కు దారులు ఎవరూ లేకపోతే మరో లబ్ధిదారుల్ని ఎంపిక చేసే పంపిణీ చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా పిడి హౌసింగ్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.
చింతకాని మండలం వందనం గ్రామం చెందిన ప్రజలు మత్స్య శాఖ సభ్యులు వందనం గ్రామ చెరువుకు సాగర్ ఎడమ కాలు ద్వారా నీటి సరఫరా పునరుద్ధరించి చెరువులు నింపాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఎస్ఈ ఇరిగేషన్ కు రాస్తూ పరిశీలించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పారస్ కుమార్, డిఆర్ఓ సీహెచ్. రామ్మూర్తి, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

www.bhadradrinews.com
భద్రాద్రి న్యూస్
తెలుగు దినపత్రిక
Bhadradrinews Telugu Daily
Follow :
@bhadradrinews
మంగళవారం
3, నవంబర్ , 2026
www.bhadradrinews.com
epaper.bhadradrinews.com
ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం

ప్రజా సమస్యపై తక్షణ స్పందన.. దెబ్బతిన్న పైపులైన్‌కు కొత్త జీవం!

- భాగ్యనగర్ తండాలో వాటర్ ట్యాంక్ ప్రధాన పైపులైన్ మరమ్మతులు పూర్తి.. స్వయంగా పనులను పర్యవేక్షించిన సర్పంచ్ బానోత్ హిరాలాల్

- ప్రజా సంక్షేమమే ప్రాధాన్యంగా ముందుకు.. సర్పంచ్ పనితీరుపై గ్రామస్తుల ప్రశంసలు



కారేపల్లి, నవంబర్ 2 (భద్రాద్రి న్యూస్ రాములు): ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యానికి తావులేకుండా తక్షణమే స్పందిస్తూ ఆదర్శవంతమైన పాలనకు నిదర్శనంగా నిలుస్తున్నారు సింగరేణి మండలం భాగ్యనగర్ తండా గ్రామపంచాయతీ సర్పంచ్ బానోత్ హిరాలాల్. గ్రామంలో తాగునీటి సరఫరాకు కీలకమైన వాటర్ ట్యాంక్ ప్రధాన పైపులైన్ దెబ్బతినడంతో విషయం తెలుసుకున్న సర్పంచ్ ఏమాత్రం ఆలస్యం చేయకుండా మరమ్మతు పనులకు శ్రీకారం చుట్టారు. దెబ్బతిన్న పైపులను తొలగించి, వాటి స్థానంలో నూతన పైపులను ఏర్పాటు చేయించి నీటి సరఫరాకు ఆటంకం కలగకుండా చర్యలు చేపట్టారు. గ్రామ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టడమే కాకుండా, మరమ్మతులు పూర్తయ్యే వరకు స్వయంగా అక్కడే ఉండి పనులను పర్యవేక్షించడం విశేషం. గ్రామంలో ఏ సమస్య తన దృష్టికి వచ్చినా తక్షణమే స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటుండటంతో ప్రజల్లో సర్పంచ్‌పై నమ్మకం మరింత బలపడుతోంది. గ్రామాభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా సర్పంచ్ ముందుకు సాగుతున్నారని గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు. పదవిని బాధ్యతగా భావిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్న హిరాలాల్ పనితీరుపై ప్రశంసలు కురిపిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అనిల్‌కుమార్, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొనగా, సర్పంచ్ బానోత్ హిరాలాల్ దగ్గరుండి మరమ్మతు పనులను పర్యవేక్షించారు.

రెండోసారి సింగరేణి మత్స్య సహకార సంఘం అధ్యక్షుడిగా తురక సాంబయ్య!

- ఏకగ్రీవంగా నూతన కార్యవర్గం ఎన్నిక.. మత్స్యకారుల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగాలని సభ్యుల ఆకాంక్ష



కారేపల్లి, నవంబర్ 2 (భద్రాద్రి న్యూస్ రాములు): ఖమ్మం జిల్లా సింగరేణి మండల మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడిగా తురక సాంబయ్య రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం సింగరేణి పెద్ద చెరువు కట్ట వద్ద ఎన్నికల అధికారి జి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల ప్రక్రియలో సంఘానికి చెందిన 140 మంది సభ్యులు పాల్గొని నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో సంఘం అధ్యక్షుడిగా తురక సాంబయ్య, ఉపాధ్యక్షుడిగా తురక కోటేశ్వరరావు, కార్యదర్శిగా చింతల సంపత్ ఎన్నికయ్యారు. డైరెక్టర్లుగా గిరిపోయిన వెంకన్న, బోళ్ల లచ్చయ్య, తురక రాజు, పేరున గురువులు, తురక లక్ష్మి, గంగారబోయిన జానకమ్మ ఎన్నికయ్యారు. రెండోసారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తురక సాంబయ్యకు సంఘం సభ్యులు, మత్స్యకారులు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా మత్స్యకారుల జీవన ప్రమాణాల మెరుగుదల, వారి హక్కుల పరిరక్షణ, వృత్తిపరమైన సమస్యల పరిష్కారానికి నూతన కార్యవర్గం సమష్టిగా కృషి చేయాలని సభ్యులు ఆకాంక్షించారు. సంఘాన్ని మరింత బలోపేతం చేస్తూ మత్స్యకారుల అభ్యున్నతికి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంఘం మాజీ అధ్యక్షులు గంగారబోయిన సత్యం, దిండి లచ్చయ్య, గంగారబోయిన యాదగిరి, పెద్దమ్మ సత్యం, తురక రవి, ముదిరాజ్ పెద్దమనిషి తురక రాంబాబు, గొడుగు శ్రీనివాస్, ఉడతల సంపత్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి భగవద్గీత మహా పరీక్ష పోటీలలో వాని వివేకానంద విద్యార్థులు

- జిల్లాస్థాయి భగవద్గీత మహాపరక్ష పోటీలలో పాల్గొన్న విద్యార్థులు 774





వైరా, నవంబర్ 2,(భద్రాద్రి న్యూస్) : విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన “లక్ష యువ గళ గీతార్చన “ జిల్లాస్థాయి భగవద్గీత నిర్వహించిన మహా పరీక్ష పోటీలలో పాల్గొన్న ఈ మహా పోటీలలో వైరా వాని వివేకానంద విద్యాలయం పాఠశాల విద్యార్థులు బహుమతులు సాధించారు. సీనియర్ విభాగంలో సిహెచ్ సింధు ద్వితీయ బహుమతి, జూనియర్ విభాగంలో కె.దస్వంత్ మాలిక్, తృతీయ బహుమతి షేక్. ఉమర్ ఫారూఖ్ బహుమతులు సాధించారు ఖమ్మం లో నిర్వహించిన ఈ బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గిన్నిస్ బుక్ ఆఫ్ ఓల్డ్ రికార్డ్ ప్రఖ్యాత గజల్ గాయకుడు గజల్ శ్రీనివాస్ పాల్గొని గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చుండూరి కోటేశ్వరరావు, ప్రిన్సిపాల్ చుండూరి వాణి మాట్లాడుతూ మా పాఠశాల విద్యార్థులు చదువుతోపాటు జిల్లా స్థాయిలో నిర్వహించే ఏ పోటీలోనైనా బహుమతులు సాధిస్తారని తెలియజేయుటకు మేమెంతో గర్వపడుతున్నామని, విద్యార్థులలో ఆధ్యాత్మిక, సాంస్కృతిక విలువలను పెంపొందించడానికి ఇటువంటి పోటీలు ఎంతగానో దోహదపడతాయని వారు తెలిపారు. బహుమతులు సాధించిన విద్యార్థులను పాఠశాల ఆవరణంలో అందరి సమక్షంలో అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కన్వీనర్ గింజుపల్లి జనార్ధన్, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు , విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ కరాటే పోటీల్లో హార్వెస్ట్ విద్యార్థుల పతకాల పంట!

- 600 మంది క్రీడాకారుల మధ్య సత్తాచాటిన హార్వెస్ట్ చిన్నారులు

- కటా విభాగంలో స్వర్ణ, రజత, కాంస్య పతకాలతో మెరిసిన విద్యార్థులు



ఖమ్మం ప్రతినిధి , నవంబర్ 2 (భద్రాద్రి న్యూస్): జాతీయ స్థాయి కరాటే పోటీల్లో హార్వెస్ట్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ విద్యార్థులు అసాధారణ ప్రతిభ కనబరిచి పతకాల పంట పండించారు. సుమన్ షోటోకాన్ స్పోర్ట్స్ కరాటే-డూ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం ఖమ్మంలోని వర్తక సంఘ భవన్‌లో నిర్వహించిన 32వ జాతీయ స్థాయి కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో హార్వెస్ట్ విద్యార్థులు సత్తాచాటి పాఠశాలకు కీర్తిప్రతిష్ఠలు తీసుకొచ్చారు. దేశవ్యాప్తంగా సుమారు 600 మంది క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీల్లో హార్వెస్ట్ పాఠశాల నుంచి దాదాపు 40 మంది విద్యార్థులు బరిలోకి దిగి తమ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించారు. కటా విభాగంలో అండర్-12, అండర్-14, అండర్-17 కేటగిరీల్లో స్వర్ణ, రజత, కాంస్య పతకాలు సాధించి విజయకేతనం ఎగురవేశారు. అండర్-12 విభాగంలో రెండు స్వర్ణ పతకాలు, అండర్-14 విభాగంలో స్వర్ణం, రజతం, కాంస్య పతకాలు, అండర్-17 విభాగంలో రెండు కాంస్య పతకాలను కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పి. రవిమారుత్ మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర వికాసమే హార్వెస్ట్ విద్యాసంస్థల ప్రధాన లక్ష్యమని తెలిపారు. క్రీడలు విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, సమయపాలన, క్రమశిక్షణ, పట్టుదలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో వందలాది మంది క్రీడాకారుల మధ్య తమ విద్యార్థులు ప్రతిభ చాటడం గర్వకారణమన్నారు. ప్రిన్సిపాల్ ఆర్. పార్వతిరెడ్డి మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులను ప్రోత్సహించడం ఎంతో అవసరమని అన్నారు. కరాటే వంటి మార్షల్ ఆర్ట్స్ ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, పట్టుదలతో పాటు ఆత్మరక్షణ నైపుణ్యాలను పెంపొందిస్తాయని తెలిపారు. జాతీయ స్థాయిలో పతకాలు సాధించడం ఆనందంగా ఉందని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. విజేతలైన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం అభినందించాయి. విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ అందించిన కరాటే కోచ్ అల్తాఫ్‌తో పాటు చీఫ్ ఆర్గనైజర్ జల్లెల శ్రీనివాసరావును ప్రత్యేకంగా అభినందించారు.

రైతు సంక్షేమమే లక్ష్యంగా కృషి విజ్ఞాన కేంద్రం సేవలు

-- రైతు సదస్సు, వ్యవసాయ ప్రదర్శన

-- 350 మంది రైతులకు మొక్కజొన్న విత్తనాల పంపిణీ



కొత్తగూడెం అర్బన్, నవంబర్ 02 (భద్రాద్రి న్యూస్) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కృషి విజ్ఞాన కేంద్రం, అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల విద్యార్థుల గ్రామీణ వ్యవసాయ అనుభవ కార్యక్రమం సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం కృషి విజ్ఞాన కేంద్రంలో రైతు సదస్సు, వ్యవసాయ ప్రదర్శన, మొక్కజొన్న విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సుమారు 350 మంది రైతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడె గణేష్ చౌహాన్ మాట్లాడుతూ... రైతులు దేశానికి వెన్నెముక వంటివారని పేర్కొన్నారు. రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించి అధిక దిగుబడులు సాధించేందుకు కృషి విజ్ఞాన కేంద్రం అందిస్తున్న సాంకేతిక సేవలు, సలహాలు, సూచనలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ శిరివరపు లలితకుమారి మాట్లాడుతూ... వ్యవసాయం, అనుబంధ రంగాల్లో మహిళల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. మహిళల భాగస్వామ్యాన్ని పెంపొందించడం ద్వారా వ్యవసాయ కుటుంబాల ఆదాయాన్ని పెంచడంతో పాటు గ్రామీణ ఆర్థికాభివృద్ధికి దోహదపడవచ్చని తెలిపారు. అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జె. హేమంత్ కుమార్ మాట్లాడుతూ... ఆధునిక వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు అందిపుచ్చుకోవాలని సూచించారు. తద్వారా సాగు ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు మెరుగైన దిగుబడులు సాధించి అధిక ఆదాయం పొందవచ్చని వివరించారు. కృషి విజ్ఞాన కేంద్రం, భద్రాద్రి కొత్తగూడెం సీనియర్ శాస్త్రవేత్త, అధిపతి డాక్టర్ టి. భరత్ మాట్లాడుతూ... కేంద్రం ద్వారా రైతులకు అందిస్తున్న శిక్షణా కార్యక్రమాలు, సాంకేతిక సేవలు, విస్తరణ కార్యక్రమాలను వివరించారు. ఎల్‌నినో ప్రభావంతో వ్యవసాయ రంగానికి ఎదురయ్యే ప్రతికూల పరిస్థితులను ప్రస్తావిస్తూ, మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంట ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వి. బాబురావు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి టాగోర్, తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంక్ సీనియర్ మేనేజర్ జి. సునీల్ కుమార్, అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల అధ్యాపకులు డాక్టర్ సృజన్, డాక్టర్ శిరీష, డాక్టర్ రమేష్, బి. శివ, విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా రైతులకు డిహెచ్ఎం-121 రకం మొక్కజొన్న విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సదస్సు ద్వారా ఆధునిక వ్యవసాయ పద్ధతులు, వాతావరణ అనుకూల సాగు విధానాలు, సాగు ఖర్చుల తగ్గింపు, వ్యవసాయ ఆదాయ పెంపుపై రైతులకు అవగాహన కల్పించారు.







వనమా రాజకీయ ప్రస్థానం ఆదర్శప్రాయం

- మాజీ మంత్రి వనమాకు రేగా కాంతారావు జన్మదిన శుభాకాంక్షలు

- పట్టు శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసిన మాజీ ప్రభుత్వ విప్



పాల్వంచ, నవంబర్ 2 (భద్రాద్రి న్యూస్): సీనియర్ రాజకీయ నాయకులు, మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు 82వ జన్మదినాన్ని పురస్కరించుకుని మాజీ ప్రభుత్వ విప్, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు సోమవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పాల్వంచలోని వనమా స్వగృహానికి వెళ్లిన రేగా కాంతారావు పుష్పగుచ్ఛం అందించి, పట్టు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రేగా కాంతారావు మాట్లాడుతూ సాధారణ కార్యకర్త స్థాయి నుంచి వార్డు సభ్యుడిగా, ఎమ్మెల్యేగా, మంత్రిగా ఎదిగి సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో ప్రజలకు విశేష సేవలందించిన నాయకుడు వనమా వెంకటేశ్వరరావు అని కొనియాడారు. పేద ప్రజలు, పార్టీ కార్యకర్తల సంక్షేమం కోసం నిరంతరం పరితపించే ప్రజానాయకుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. 2009 ఎన్నికల సమయంలో వనమా దంపతుల చేతుల మీదుగానే తొలిసారిగా బీ-ఫామ్ అందుకుని తాను రాజకీయ రంగప్రవేశం చేశానని రేగా గుర్తుచేసుకున్నారు. ఆ సమయంలో వారు అందించిన ప్రోత్సాహం, ఆశీస్సులను జీవితంలో ఎప్పటికీ మరువలేనని భావోద్వేగంగా పేర్కొన్నారు. వనమా సుదీర్ఘ రాజకీయ అనుభవం, ప్రజాసేవా దృక్పథం, మార్గదర్శకత్వం రాబోయే తరాల నాయకులకు ఆదర్శప్రాయమని అన్నారు. భద్రాద్రి సీతారాముల ఆశీస్సులతో వనమా వెంకటేశ్వరరావు, ఆయన కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో కలకాలం వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, వనమా అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ధరల దోపిడీకి అడ్డుకట్ట వేయాలి

- పేద కుటుంబాలను ఆదుకోవాలి!

- ప్రతి ఒక్కరికీ నెలకు 12 కిలోల బియ్యం, 14 రకాల నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలి -- కొండబోయిన నాగేశ్వరరావు



కారేపల్లి, నవంబర్ 2 (భద్రాద్రి న్యూస్ రాములు): ఎల్‌నినో, కరువు పరిస్థితులను సాకుగా చూపుతూ నిత్యావసర సరుకుల ధరలను ఇష్టారాజ్యంగా పెంచి సామాన్య ప్రజలపై ఆర్థిక భారం మోపడం అన్యాయమని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొండబోయిన నాగేశ్వరరావు అన్నారు. పెరుగుతున్న ధరలకు తక్షణమే అడ్డుకట్ట వేసి పేద, మధ్యతరగతి కుటుంబాలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కారేపల్లిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కరువు పరిస్థితులను ఆసరాగా చేసుకుని కొందరు వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టిస్తూ బియ్యం, ఇతర నిత్యావసర సరుకుల ధరలను భారీగా పెంచుతున్నారని విమర్శించారు. ఇప్పటికే పెరిగిన ధరలతో సామాన్య కుటుంబాల జీవనం భారంగా మారిందని, రోజువారీ కూలీ పనులు చేసుకునే పేదలు కుటుంబ పోషణకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధరల నియంత్రణలో ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ చౌక ధరల దుకాణాల ద్వారా ప్రతి మనిషికి నెలకు 12 కిలోల బియ్యంతో పాటు 14 రకాల నిత్యావసర సరుకులను ఉచితంగా లేదా రాయితీపై పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. మంచి నూనె, కందిపప్పు, గోధుమలు, జొన్నలు, పంచదార, టీ పొడి, ఉప్పు, కారం, పసుపు తదితర సరుకులను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ప్రతి దుకాణంలో సరుకుల ధరల పట్టికను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని, బ్లాక్ మార్కెట్‌కు పాల్పడుతూ అధిక ధరలకు సరుకులు విక్రయించే మిల్లర్లు, టోకు వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

కూలీలకు 200 రోజుల పని.. రోజుకు రూ.800 కూలీ ఇవ్వాలి!

కరువు ప్రభావంతో గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కూలీలకు పనులు దొరకక ఉపాధి లేకుండా పోతోందని నాగేశ్వరరావు పేర్కొన్నారు. ప్రతి గ్రామీణ కుటుంబానికి ఏడాదికి 200 రోజుల ఉపాధి హామీ పని కల్పించడంతో పాటు, పని కొలతలతో సంబంధం లేకుండా రోజుకు రూ.800 కూలీ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉపాధి పనులను విస్తృతంగా చేపట్టి గ్రామీణ పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలన్నారు. అలాగే రైతుల రుణాలను పూర్తిస్థాయిలో మాఫీ చేసి, సాగు అవసరాల కోసం కొత్త రుణాలు అందించాలని కోరారు. కరువు నివారణ, సహాయక చర్యల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక నిధులు కేటాయించి రైతులు, వ్యవసాయ కూలీలు, పేద ప్రజలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు, ప్రస్తుత కరువు పరిస్థితుల తీవ్రతను గుర్తించి తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని కొండబోయిన నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

www.bhadradrinews.com
భద్రాద్రి న్యూస్
తెలుగు దినపత్రిక
Bhadradrinews Telugu Daily

బియ్యం దొంగ ఆళ్ళ మురళి ని వెంటనే అరెస్ట్ చెయ్యాలి

- కలెక్టరేట్ ఎదుట ప్లకార్డులతో నిరసన
- మురళి ని కాంగ్రెస్ పార్టీ నుండి సస్పెండ్ చేయాలి
- జేబీపీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్

కొత్తగూడెం అర్బన్, నవంబర్ 02 (భద్రాద్రి న్యూస్) : బియ్యాన్ని దారిమళ్ళించిన కేసులో ముద్దాయిగా ఉన్న కాంగ్రెస్ నాయకుడు ఆళ్ళ మురళి ని వెంటనే అరెస్ట్ చెయ్యాలని జైభీమ్ రావ్ భారత్ పార్టీ (జేబీపీ) స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ శ్రేణులతో కలిసి కలెక్టర్ కార్యాలయం ఎదుట ప్లకార్డులతో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా కామేష్ మాట్లాడుతూ... కొత్తగూడెం పట్టణ 3వ పోలీస్ స్టేషన్ లో నమోదు అయిన క్రైమ్ నెంబర్: 202/2026 కేసులో ఏ1 ముద్దాయిగా ఉన్న ఆళ్ళ మురళి సివిల్ సప్లైస్ కార్పొరేషన్ వారు రైతుల దగ్గర నుండి మురళి మేనేజింగ్ పార్టనర్ గా రైస్ మిల్లర్ కు ధాన్యాన్ని అప్పగిస్తే రైస్ మిల్లర్ల వాళ్ళు మిల్లింగ్ చేసి తిరిగి బియ్యాన్ని ప్రభుత్వానికి అప్పగించాలి. కానీ ఆళ్ళ మురళి అలా చేయకుండా రెండు సంవత్సరాల ఖరీఫ్, రబీ సీజన్ల నుండి సేకరించిన 6 కోట్ల 91 లక్షల రూపాయల విలువ చేసే ధాన్యాన్ని అమ్ముకున్న మురళి నీ ఎందుకు అరెస్ట్ చేయడం లేదని ప్రశ్నించారు. మురళి గతంలో కూడా 2021, 2022 లో ఇదేవిధంగా ధాన్యాన్ని మళ్లించిన విషయంలో 3 నెలల క్రిందట 2 కోట్ల రూపాయలు చెల్లించాడని గుర్తు చేశారు. రైతుల వద్ద నుండి మిల్లర్లు ధాన్యాన్ని సేకరించిన తర్వాత రెవెన్యూ అధికారులు 15 రోజులకు ఒకసారి ఫిజికల్ వెరిఫికేషన్ నిర్వహించాలని, కానీ లక్షల రూపాయల మామూళ్ల మత్తుకు అలవాటు పడిన అధికారులు రెండు సంవత్సరాలుగా ఇంత పెద్ద బాగోతం నడుపుతున్నా చూసి చూడనట్లు వ్యవహరించారని ఆరోపించారు. జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి బియ్యం దారి మళ్లించిన ఆళ్ళ మురళి కి సహకరించిన రెవెన్యూ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కోట్ల రూపాయల అవినీతికి పాల్పడిన ఆళ్ళ మురళి ని వెంటనే కాంగ్రెస్ పార్టీ నుండి సస్పెండ్ చేసి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మాలోత్ వీరు నాయక్,శంకర్,రాంబాబు, కవిత,స్వాతి తదితరులు పాల్గొన్నారు.



మహిళలు వృత్తి విద్యా కోర్సులను సద్వినియోగం చేసుకోవాలి

- కొత్తగూడెం ఏరియా సేవా అధ్యక్షురాలు సీహెచ్.గీతారాణి వెంకటరమణ
- సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత వృత్తి శిక్షణ తరగతులు ప్రారంభం

కొత్తగూడెం అర్బన్, నవంబర్ 02 (భద్రాద్రి న్యూస్) : మహిళలు వృత్తి విద్యా కోర్సులను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి పొందుతూ ఆర్థికంగా ఎదగాలని కొత్తగూడెం ఏరియా సేవా అధ్యక్షురాలు సీహెచ్.గీతారాణి వెంకటరమణ అన్నారు. సింగరేణి కొత్తగూడెం ఏరియా సేవా సమితి ఆధ్వర్యంలో రుద్రంపూర్ మహిళలకు ఉచిత టైలరింగ్, రామవరం మహిళలకు ఫ్యాషన్ డిజైనింగ్, మగ్గం వర్క్, గౌతంపూర్ మహిళలకు బ్యూటీషియన్ కోర్సుల్లో మూడు నెలల పాటు నిర్వహించే ఉచిత శిక్షణ తరగతులను సోమవారం రుద్రంపూర్ సీఈఆర్ క్లబ్‌లో ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా గీతారాణి వెంకటరమణ మాట్లాడుతూ... సింగరేణి ఉద్యోగుల కుటుంబాలకు చెందిన మహిళలతో పాటు ప్రాజెక్టు ప్రభావిత, పరిసర ప్రాంతాల మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించి ఆర్థికంగా బలోపేతం చేయడమే సేవా సమితి ప్రధాన లక్ష్యమన్నారు. శిక్షణ తరగతులకు క్రమం తప్పకుండా హాజరై, నైపుణ్యాలను శ్రద్ధగా నేర్చుకొని కోర్సులను విజయవంతంగా పూర్తి చేయాలని సూచించారు. నేర్చుకున్న విద్యను స్వయం ఉపాధికి ఉపయోగించుకొని కుటుంబ ఆర్థిక అభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షించారు. అనంతరం 2025--26 ఆర్థిక సంవత్సరంలో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళా లబ్ధిదారులకు సేవా అధ్యక్షురాలి చేతుల మీదుగా శిక్షణ ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. అలాగే కొత్తగా శిక్షణ పొందుతున్న మహిళలకు పార్వతి మదన్మోహన్ ఒక మగ్గం స్టాండ్‌ను ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమంలో డీవైపీఎం జి. హరీష్, సీనియర్ పీఓ ఎం. మురళి, సేవా కోఆర్డినేటర్ సీహెచ్. సాగర్, సేవా కార్యదర్శి అనిత, శిక్షకులు, సేవా సభ్యులు, శిక్షణ అభ్యర్థులు పాల్గొన్నారు.



దూడల్లో నట్టల నివారణ ద్వారా ఆరోగ్యం, ఎదుగుదల, ఉత్పాదకత పెంపొందించొచ్చు

- గోపాలపురం, రామకృష్ణాపురం గ్రామాల్లో సామూహిక దూడల నట్టల నివారణ కార్యక్రమం ప్రారంభం
- పశు వైద్య శాఖ అధికారి డాక్టర్ జి నాగులు





కామేపల్లి, నవంబర్ 2 (భద్రాద్రిన్యూస్): పశువుల దూడల్లోనట్టల నివారణ ద్వారా వాటి ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు ఉత్పాదక శక్తిని పెంపొందించొచ్చని మండల పశు వైద్యాధికారి డాక్టర్ నాగులు వెల్లడించారు. సోమవారం మండలం లోని గోపాలపురం,రామకృష్ణాపురం గ్రామాల్లో సామూహిక దూడల నట్టల నివారణ కార్యక్రమాన్ని కామేపల్లి రామకృష్ణాపురం గ్రామ సర్పంచులు అజ్మీరా బుల్లి హరి, అజ్మీర్ ధ్వాలి చిన్న ప్రారంభించారు.ఈ సందర్భంగా మొత్తం 270 దూడలకు నట్టల నివారణ మందులు తాగించడం జరిగింది.అన్ని వర్గాలకు చెందిన పాడి రైతులు పాల్గొని సద్వినియోగం చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది శిరీష, వంశీ, శరత్, ధర్మ, లక్ష్మయ్య పాల్గొన్నారు.

అంగన్వాడీల వేతన హామీ ప్రభుత్వం నిలబెట్టుకోవాలి

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే. కూనంనేని సాంబశివరావు



కొత్తగూడెం అర్బన్, నవంబర్ 02 (భద్రాద్రి న్యూస్) : అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, ఎన్నికల వేళ సీఎం ఇచ్చిన రూ.18,000 వేతన పెంపు హామీని తక్షణమే నిలబెట్టుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. అంగన్వాడీ ఉద్యోగుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్ ఎదుట వందలాది మంది అంగన్వాడీ కార్యకర్తలతో చేపట్టిన కలెక్టరేట్ ముట్టడి, మహాధర్నా కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా గ్రామీణ, పట్టణ ప్రగతిలో భాగస్వాములవుతూ మాతాశిశు సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేస్తూ శిశు, గర్భిణుల మరణాల నివారణకు అంగన్వాడీలు అహర్నిశలు శ్రమిస్తున్నారని కొనియాడారు. మార్కెట్లో నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వం ఇస్తున్న రూ.13 వేల వేతనంతో కుటుంబం బ్రతకడం సాధ్యం కాదని, సామాన్య కార్మికుల వేతనాల పెంపుపై నిర్లక్ష్యం తగదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషా, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్ మాట్లాడుతూ... కేంద్రాల అద్దెలు, గ్యాస్, ఆరోగ్యలక్ష్మి పెండింగ్ బిల్లులను ప్రభుత్వం విడుదల చేయకుండా తాత్సారం చేయడం దుర్మార్గమన్నారు. కేంద్రాలకు నాణ్యతలేని సరుకులు సరఫరా చేస్తున్న టెండర్లను రద్దు చేసి శనగలు, కారం, చింతపండు, గుడ్లు నాణ్యమైనవి పంపిణీ చేయాలని, టీచర్లపై బలవంతంగా రుద్దుతున్న బీఎల్‌వో డ్యూటీలను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలకు పీఎఫ్, హెల్త్ కార్డులు, ఇన్సూరెన్స్ సౌకర్యాలు కల్పిస్తూ ఆయాలకు కనీసం రూ.10 వేల వేతనం అందించాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి ఖాళీగా ఉన్న గ్రేడ్-2 సూపర్వైజర్ పోస్టులను భర్తీ చేయాలని స్పష్టం చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా సంక్షేమ శాఖ అధికారి తారకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు కంచర్ల జమలయ్య వేల్పుల మల్లికార్జున్, భూక్యా శ్రీనివాస్, రెడ్డి అరుణ, విజయ, భారతి, సంధ్య, ఇందిర, మీనాకుమారి, కృష్ణకుమారి, సమ్మక్క, చిన్నారి, శ్రీదేవి, సునీత, సరస్వతి, సుజాత, శోభారాణి, గుర్రం వెంకటేశ్వర్లు, ప్రసాద్, అన్నారపు వెంకటేశ్వర్లు, ఇట్టి వెంకట్రావు, నిమ్మల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను గడువులోగా పరిష్కరించాలి

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్



కొత్తగూడెం అర్బన్, నవంబర్ 02 (భద్రాద్రి న్యూస్) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ అంకిత్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రజలు ఆఫీసుల చుట్టూ తిరగకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, పెండింగ్ సమస్యలపై క్షేత్రస్థాయి విచారణ జరిపి నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. పరిష్కార వివరాలను పోర్టల్‌లో నమోదు చేసి దరఖాస్తుదారులకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు డి. వేణుగోపాల్, విద్యా చందన పాల్గొన్నారు. ప్రజావాణి ముఖ్య దరఖాస్తులు – చర్యలు: రేషన్ కార్డు పునరుద్ధరణ: పాల్వంచకు చెందిన వై. నాగలక్ష్మి, అశ్వారావుపేటకు చెందిన బత్తుల జానకమ్మల రేషన్ కార్డుల దరఖాస్తులను కలెక్టర్ డీసీఎస్ఓ కు బదిలీ చేశారు. ఇంటి స్థలం మంజూరు: లక్ష్మీదేవిపల్లి మండలానికి చెందిన నిరుపేదరాలు మేక రజని సమర్పించిన ఇంటి స్థలం అర్జీని తహసీల్దార్‌కు పంపారు. డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు: కొత్తగూడెంకు చెందిన పోలియో బాధితురాలు మహమ్మద్ జరీనా బేగానికి గతంలో కేటాయించి రద్దయిన డబుల్ బెడ్‌రూమ్ ఇంటి దరఖాస్తును పీడీ హౌసింగ్‌కు ఎండార్స్ చేశారు.

పండితాపురం లోబాధిత కుటుంబాలకు పరామర్శ

- కాంగ్రెస్ నేతల ఆర్థిక సాయం
- సొసైటీ చైర్మన్ ధనియాకుల హనుమంతరావు



కామేపల్లి, నవంబర్2(భద్రాద్రిన్యూస్):- పండితాపురం గ్రామంలోని పలు బాధిత కుటుంబాలను కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడుతున్న బొమ్మగాని సైదులును పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అలాగే ఇటీవలే మరణించిన శ్రీమతి తమిశెట్టి ఉపేంద్రమ్మ, దిండు నరమ్మల నివాసాలకు వెళ్ళి వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా కొండాయిగూడెం సొసైటీ చైర్మన్ ధనియాకుల హనుమంతరావు బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు కొమ్మినేని శ్రీనివాసరావు, ఉప్పుగండ్ల వీరభద్రం, ఇంతబోయిన విటల్ రావు, నాగేశ్వరావు, చల్ల సులోమన్, దుద్దుకూరి నవీన్ కుమార్, దూగుండ్ల వీరన్న, ధరావత్ ఉపేందర్,బానోత్ శంకర్,విన్ని బాబు,కానుగుల వెంకన్న,కృష్ణ కొరవిలి తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల ఆశయ సాధనల కోసం ఉద్యమించి పోరాడాలి

- హరిచంద్రపురంలో సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ సంస్మరణ సభ
- రెండు మండలాల సంయుక్త కార్యదర్శి ఎన్ వి రాకేష్



కామేపల్లి, నవంబరు 2 (భద్రాద్రి న్యూస్): ప్రజల విముక్తి, సామాజిక అసమానతల నిర్మూలన కోసం ప్రాణత్యాగం చేసిన విప్లవ అమరవీరుల ఆశయ సాధనకు ప్రజా పోరాటాలను కొనసాగించాలని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ కామేపల్లి, కారేపల్లి సంయుక్త మండలాల సహాయ కార్యదర్శి ఎన్.వి. రాకేష్ పిలుపునిచ్చారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా కామేపల్లి మండలం హరిచంద్రపురంలో సోమవారం అమరవీరుల సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా అమరవీరుల చిత్రపటాలకు నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడారు. పేదలు, కార్మికులు, రైతుల హక్కుల కోసం అమరులు చేసిన పోరాటాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. సమాజంలో అన్యాయాలు, దోపిడీకి వ్యతిరేకంగా ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాస్ లైన్ నాయకులు మంగీలాల్, కిషన్, సామ్య, తస్మా, రాములు, వాగ్య నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే బియ్యం విక్రయించాలి - గ్రంధి ప్రవీణ్ కుమార్

– అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తప్పవు





వైరా, నవంబర్ 2, (భద్రాద్రి న్యూస్) : ఖమ్మం జిల్లా కేంద్రంలోని పలు బియ్యం దుకాణాలను జిల్లా పౌర సరఫరాల అధికారి చందన్ కుమార్ సూచనల మేరకు సోమవారం జిల్లా కాంగ్రెస్ వాణిజ్య విభాగ అధ్యక్షుడు గ్రంధి ప్రవీణ్ కుమార్ పలు బియ్యం దుకాణాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ఎవరైనా అధిక ధరలకు బియ్యం అమ్మితే కఠిన చర్యలు తప్పవు అని ప్రభుత్వం ఏదైతే ధర కేటాయించిందో, అదే ధరలకు ప్రతి ఒక్క దుకాణాదారుడు అమ్మాలని లేని పక్షంలో వారిపై చర్యలు కఠినంగా ఉంటాయని, బియ్యం వ్యాపారులు ప్రభుత్వ నిర్ణీత ధరలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు 26 కిలోల బియ్యం బ్యాగులపై ధరల వివరాలను వినియోగదారులకు కనిపించేలా ఏర్పాటు చేయాలని సూచించారు. బీసీటీ బియ్యం కిలో రూ 66, ఆర్ ఎన్ ఆర్ బియ్యం కిలో రూ 74, హెచ్ఎంటి బియ్యం కిలో రూ 79, చొప్పున విక్రయించాలని పేర్కొన్నారు. నిర్ణీత ధరల కంటే అధికంగా విక్రయించే వ్యాపారులపై అధికారులు కఠిన చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు. బియ్యం వ్యాపారులు ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరారు. ఎవరైనా అధిక ధరలకు బియ్యం ఎక్కువ ఇస్తే వినియోగదారులు సంబంధిత పౌర రసరఫరాల అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

సీఎంఆర్ ధాన్యం పక్కదారి.. కాంగ్రెస్ నేతపై కేసు

– రూ. 7 కోట్లు విలువ చేసే బియ్యం పక్కదారి



కొత్తగూడెం అర్బన్, నవంబర్ 02 (భద్రాద్రి న్యూస్) : సీఎంఆర్ ధాన్యాన్ని పక్కదారి పట్టించిన మేదరబస్తీలోని మురళికృష్ణ రైస్ మిల్లు యజమాని, కాంగ్రెస్ పార్టీ నేత ఆళ్ల మురళి గోపాలకృష్ణ, కో పార్టనర్ అంజనమ్మపై కేసు నమోదు చేసినట్లు త్రీ టౌన్ పోలీసులు తెలిపారు. రైతుల నుండి సేకరించిన 2,600 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొత్తగూడెం నగరంలోని మేదరబస్తీలో గల మురళికృష్ణ రైస్ మిల్లుకు అప్పగించారు. ఈ సీఎంఆర్ ధాన్యాన్ని మిల్లు పట్టించిన అనంతరం ఆ బియ్యాన్ని తిరిగి ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉండగా మిల్లు యజమాని ఆళ్ల మురళి పక్కదారి పట్టించాడు. కొత్తగూడెంలో కాంగ్రెస్ నేతగా చలామణి అవుతున్న ఆళ్ల మురళి ఇలాంటి ప్రభుత్వ వ్యతిరేక చర్యలకు పాల్పడడం విమర్శలకు దారితీస్తుంది. పక్కదారి పట్టించిన ధాన్యం విలువ సుమారు రూ.6.90 కోట్ల పై చిలుకు ఉంటుందని సమాచారం. పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ త్రినాథ్ బాబు బృందం గత నెల 28న మిల్లుపై దాడులు నిర్వహించి తనిఖీలు చేశారు. దీంతో అక్కడ ధాన్యం లేని విషయాన్ని గమనించిన అధికారులు ధాన్యాన్ని మిల్లు పట్టించి ప్రభుత్వానికి అప్పగించాల్సిన బియ్యం తిరిగి ఇవ్వకుండా, ఇతరులకు అక్రమంగా తరలించినట్లు ధ్రువీకరించారు. ఈ విషయంపై వెంటనే స్పందించిన సివిల్ సప్లైస్ జిల్లా అధికారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు త్రీ టౌన్ పోలీసులు సదరు కాంగ్రెస్ నేత, మురళి కృష్ణ రైస్ మిల్ యజమాని ఆళ్ల మురళి, అతడి కో పార్టనర్ లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

భట్రాజ్ భవనానికి స్థలం కేటాయించాలి

-- కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కు విజ్ఞాపన



కొత్తగూడెం అర్బన్, నవంబర్ 02 (భద్రాద్రి న్యూస్) : ఆర్థికంగా వెనుకబడిన భట్రాజు సంఘం అభివృద్ధికి, సంఘ భవన నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని కేటాయించాలని సంఘ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును విద్యానగర్‌లోని ఆయన నివాసంలో కలిసి విజ్ఞాపన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును సంఘ నాయకులు ఘనంగా సన్మానించారు. అనంతరం భట్రాజులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అర్హులైన పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, కొత్తగూడెంలో ప్రభుత్వ స్థలాన్ని భట్రాజ్ సంఘ భవన నిర్మాణానికి కేటాయించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు స్పందిస్తూ.. సంఘ భవన నిర్మాణానికి అవసరమైన స్థలం కేటాయించే విషయంలో తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భట్రాజు సంఘం జిల్లా అధ్యక్షులు సరస్వతి చలపతి రాజు, కార్యదర్శి రామచంద్రరాజు, సుధాకర్ రాజు, నారాయణరాజు, రవీందర్ రాజు, శ్రీనివాసరాజు, రమణ రాజు, సరికొండ కృష్ణప్రసాద్, ఉమా జగన్, జగన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెం గణేష్ టెంపుల్ నూతన ఈఓగా అద్దంకి విజయ్ కుమార్



కొత్తగూడెం అర్బన్, నవంబర్ 02 (భద్రాద్రి న్యూస్) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం పట్టణంలోని శ్రీ విజయ విఘ్నేశ్వర దేవస్థానం (గణేష్ టెంపుల్) నూతన కార్యనిర్వహణాధికారిగా (గ్రేడ్-1) అద్దంకి విజయ్ కుమార్ అదనపు బాధ్యతలు స్వీకరించారు. దేవాదాయ శాఖ కమిషనర్, హైదరాబాద్ జారీ చేసిన ఉత్తర్వుల మేరకు కేశవాపురంలోని శ్రీ కనకదుర్గ దేవస్థానం (పెద్దమ్మగుడి) కార్యనిర్వహణాధికారి ((గ్రేడ్-1)గా విధులు నిర్వహిస్తున్న విజయ్ కుమార్‌కు గణేష్ టెంపుల్ అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, సిబ్బంది నూతన ఈఓకు స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, వేద పండితులు వేదాశీర్వచనం అందజేశారు.



ఆగి ఉన్న డీసీఎంను ఢీకొన్న కారు

ఒకరి మృతి, డ్రైవర్‌కు గాయాలు

జోగుళాంబ గద్వాల జిల్లా :

ఇటిక్యాల మండలం ధర్మవరం స్టేజ్ సమీపంలో జాతీయ రహదారిపై ఆగి ఉన్న డీసీఎంను కారు ఢీకొన ఘటనలో ఒకరు మృతి చెందగా మరొక్కరికి గాయాలయ్యాయి. ఏపీలోని శ్రీ సత్యసాయి జిల్లా పులకుంట గ్రామానికి చెందిన మల్లికార్జున్ (40), బాలాజీ డ్రైవర్ తో పాటు మల్లికార్జున్ ఇద్దరు కలిసి హైదరాబాద్ నుంచి కారులో స్వగ్రామానికి బయలుదేరారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం ఇటిక్యాల మండలం ధర్మవరం స్టేజ్ వద్ద జాతీయ రహదారి పై అగిఉన్న డీసీఎం వాహనాన్ని కారు ఢీకొట్టింది. దీంతో కారు నుజ్జునుజ్జైంది. ఈ ఘటనలో మల్లికార్జున్(40) మృతి చెందాడు. డ్రైవర్ బాలాజీకి స్వల్పగాయాలయ్యాయి. కోదండపురం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి మత్తులో యువత భవిష్యత్తుతో చెలగాటం!

ఐదు కేసులు నమోదైనా మారని నిందితుడి తీరు.. గంజాయి అక్రమ రవాణాదారుడిపై సైబరాబాద్ పోలీసుల పీడీ యాక్ట్ అస్త్రం

శేరిలింగంపల్లి : నవంబర్2:

సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో గంజాయి అక్రమ రవాణాను వృత్తిగా మార్చుకుని, వివిధ రాష్ట్రాల్లో తన నెట్‌వర్క్‌ను విస్తరించిన నిందితుడిపై సైబరాబాద్ పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. గంజాయి అక్రమ రవాణాకు సంబంధించి ఐదు కేసులు నమోదైనా అతడి కార్యకలాపాలు కొనసాగుతుండటంతో, మరోసారి అదే నేరాలకు పాల్పడకుండ అడ్డుకట్ట వేసేందుకు పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ పీడీ యాక్ట్ ప్రయోగించారు. యువతను మత్తు పదార్థాలకు చేరువ చేసే అక్రమ దందాపై పోలీసులు ఉక్కుపాదం మోపారు.గంజాయి మత్తు యువత భవిష్యత్తును దెబ్బతీస్తున్న వేళ.. అక్రమ రవాణా ముఠాలపై సైబరాబాద్ పోలీసులు కొరడా ఝుళిపిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల నుంచి గంజాయిని సేకరించి, వివిధ ప్రాంతాలకు సరఫరా చేస్తున్నాడనే ఆరోపణలు ఎదుర్కొంటున్న మహారాష్ట్రలోని సోలాపూర్ జిల్లాకు చెందిన సచిన్ గంగారాం మరుతి చవాన్ (36)పై పీడీ యాక్ట్ ప్రయోగించారు. పలుమార్లు కేసులు నమోదైనా నేర కార్యకలాపాలకు అడ్డుకట్ట పడకపోవడంతో ముందస్తు నిర్బంధానికి ఆదేశాలు జారీ చేశారు.



గంజాయి విక్రయం అక్రమ రవాణా చేస్తున్న గంగారాం మారుతి చావాన్

ఐదు కేసులు.. మూడు రాష్ట్రాల్లో నెట్‌వర్క్!

పోలీసుల వివరాల ప్రకారం 2020 నుంచి 2026 మధ్య సచిన్‌పై గంజాయి అక్రమ రవాణాకు సంబంధించి మొత్తం ఐదు కేసులు నమోదయ్యాయి. తెలంగాణలో మూడు, మహారాష్ట్రలో ఒకటి, కర్ణాటకలో మరొక కేసు ఉన్నాయి. వివిధ రాష్ట్రాల్లో గంజాయి సేకరణ, రవాణా, విక్రయాల కోసం పరిచయాలను, నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. గంజాయిని అధిక ధరలకు విక్రయిస్తూ అక్రమంగా డబ్బు సంపాదిస్తున్నట్లు పేర్కొన్నారు.

మత్తు దందాకు పీడీ యాక్ట్‌తో కళ్లెం!

గంజాయి అక్రమ రవాణాను పదేపదే కొనసాగించడం ప్రజారోగ్యానికి, ప్రజా శాంతికి ముప్పుగా పరిణమించే అవకాశాలున్న నేపథ్యంలో సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ నిందితుడిపై పీడీ యాక్ట్ ప్రయోగిస్తూ నిర్బంధ ఉత్తర్వులు జారీ చేశారు. పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలోని పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని చర్లపల్లి కేంద్ర కారాగారానికి తరలించారు.

యువతను మత్తు బారిన పడేసే అక్రమ దందాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవనే సంకేతాన్ని ఈ చర్య ద్వారా పోలీసులు ఇచ్చారు. గంజాయి సరఫరా, విక్రయాలపై నిఘా కొనసాగిస్తూ మత్తు పదార్థాల అక్రమ రవాణాను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి.



కేటిదొడ్డి ప్రజావాణికి మూడు ఫిర్యాదులు

జోగుళాంబ గద్వాల జిల్లా :

కేటిదొడ్డి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మూడు ఫిర్యాదులు అందాయి. వివిధ గ్రామాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ అర్జీలను ఎంపీడీవో రమణరావుకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యాశాఖ నుండి రెండు ఫిర్యాదులు, పోలీస్ శాఖ నుండి ఒకటి మొత్తం మూడు ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని మండల ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కామేపల్లిలో ఘనంగా సమాధుల ఆశీర్వాద పండుగ

- ఆత్మల రక్షణకై ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన క్రైస్తవ సోదరులు
- తల్లిదండ్రులను ప్రతి ఒక్కరు గౌరవించాలి సత్ ప్రవర్తనతో మెలగాలి
- ఆర్ సి ఎం చర్చి ఫాదర్ జి.ప్రవీణ్ కుమార్
- తల్లిదండ్రులు చిలుముల బిక్షం - మంగమ్మ జ్ఞాపకార్థం
- పేదలకు పండ్లు పంపిణీ చేసిన కుమారులు చినుముల రమేష్.శ్రీనివాస్







కామేపల్లి, నవంబర్ 2 (భద్రాద్రి న్యూస్):
కామేపల్లి లో సమాధుల ఆశీర్వాద పండుగను సోమవారం ఘనంగా నిర్వహించారు.కారేపల్లి ఆర్.సి.యం చర్చి విచారణ గురువులు ఫాదర్ జి.ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో స్థానిక ఉపదేశకులు శీలపాక వీరభద్రం సారధ్యంలో క్రైస్తవ సోదరులు అత్యంత భక్తిశ్రద్ధలతో సాంప్రదాయ బద్ధంగా సమాధుల ఆశీర్వాద పండుగను నిర్వహించారు.ఈ సందర్భంగా తల్లిదండ్రులు చిలుముల బిక్షం - మంగమ్మ సమాధి వద్ద వారి కుమారులు చినుముల శ్రీనివాస్, సర్వయ్య, రమేష్, వారి కుటుంబ సభ్యులు ఫాదర్ ప్రవీణ్ కుమార్ తో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఫాదర్ సమాధిని ఆశీర్వదించి వారి ఆత్మల రక్షణకై ప్రార్థనలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఫాదర్ మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ తమ తల్లిదండ్రులను గౌరవించాలని కోరారు. సత్ప్రవర్తన కలిగి వారి పట్ల మర్యాదగా నడుచుకోవాల ని కోరారు.సమాధుల ఆశీర్వాద పండుగ విశిష్టతను వివరించి క్రీస్తు సందేశాన్ని ఇచ్చారు. అనంతరం చినుముల శ్రీనివాస్, సర్వయ్య, రమేష్ తమ తల్లిదండ్రులు బిక్షం - మంగమ్మ జ్ఞాపకార్థం పేదలు, దివ్యాంగులు, ఆటో డ్రైవర్లకు పండ్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు చిప్పలపల్లి పుల్లయ్య, దోమల బాలశౌరి, కొర్ర పీక్ల, అజ్మీర రమేష్,అమిరిబోయిన తిరుపతయ్య, గంట సంపత్ కుమార్, పెంటయ్య,రమేష్, అభిరామ్,దివ్యాంగుల సంక్షేమ సంఘం నేత పెరుగు సైదులు, యన్నమాల రమేష్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా ఫాదర్ ప్రవీణ్ కుమార్ అన్ని సమాధుల వద్ద ప్రార్థనలు నిర్వహించారు.మృతుల ఆత్మ రక్షణకై ప్రార్థించి ఆశీర్వదించారు.చినుముల లక్ష్మి, క్రైస్తవ సోదరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కొమ్మినేపల్లి మత్స్య సహకార సంఘం అధ్యక్షులుగా నాగేంద్రబాబు ఏకగ్రీవ ఎన్నిక

కామేపల్లి, నవంబర్ 2(భద్రాద్రి న్యూస్):-
మండలంలోని అతిపెద్ద కొమ్మినేపల్లి మత్స్య పారిశ్రామిక సహకార సంఘం నూతన అధ్యక్షులుగా భూక్యా నాగేంద్రబాబు ఏకీగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం కొండాయిగూడెం సొసైటీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎన్నికల అధికారి కే కిషోర్ బాబు ఆధ్వర్యంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా బండి నాగేశ్వరరావు కార్యదర్శిగా అయితనబోయిన విఠల్ రావు ఎన్నిక కాగా కమిటీ డైరెక్టర్లుగా చల్లా మల్లయ్య,మేకల కృష్ణ,బేతి వెంకటేశ్వర్లు, ధరావత్ రవి, భానోత్ గోపీచంద్ మొగిలి శ్రీను లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు నాగేంద్రబాబు మాట్లాడుతూ సొసైటీ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు.నిరంతరం సభ్యుల సమస్యలు పరిష్కరిస్తూ వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కొండాయి గూడెం సొసైటీ చైర్మన్ డి హనుమంతరావు, కొమ్మినేపల్లి గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ మేకల మల్లికార్జునరావు, గ్రామ పెద్దలు సొసైటీ బాధ్యులు పాటిబండ్ల ప్రసాద్,దరావత్ హరిచంద్ర, బాదావత్ నాగరాజు,జి కిషన్,ధరావత్ విన్నిబాబు, తేజావత్ శంకర్, వీర నాగులు,రవి తదితరులు పాల్గొన్నారు.



ప్రజా సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ కార్యాలయం వేదిక కావాలి!

- సింగరేణిలో కాంగ్రెస్ పార్టీ నూతన కార్యాలయం ప్రారంభం
- ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం:
- మండల అధ్యక్షుడు తోటకూరి రాంబాబు

సింగరేణి, నవంబర్ 2 (భద్రాద్రి న్యూస్ రాములు): మండల ప్రజల సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేసేందుకు కాంగ్రెస్ పార్టీ నూతన కార్యాలయం ప్రత్యేక వేదికగా నిలవనుందని సింగరేణి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూరి రాంబాబు అన్నారు. సింగరేణి మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ నూతన కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా తోటకూరి రాంబాబు మాట్లాడుతూ.. మండలంలోని ప్రజలు తమ వ్యక్తిగత సమస్యలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఎదురయ్యే ఇబ్బందులు, వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన విషయాలపై నేరుగా పార్టీ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని తెలిపారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం పనిచేస్తుందని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే చిరునామాగా నిలుస్తుందని పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పదవులకు పరిమితం కాకుండా ప్రజల మధ్య ఉంటూ వారి అవసరాలను గుర్తించాలని పిలుపునిచ్చారు. ప్రజా సంక్షేమం, గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి బానోత్ రామ్మూర్తి నాయక్, సింగరేణి సర్పంచ్ మేదరి వీరప్రతాప్ (టోనీ), జిల్లా నాయకుడు గుగులోత్ భీముడు నాయక్, సొసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాస్, మాజీ చైర్మన్ ఈసాల నాగేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ పెద్దబోయిన ఉమాశంకర్, కిసాన్ ఖేత్ మండల అధ్యక్షుడు కడియాల సుధాకర్, మైనారిటీ సెల్ మండల అధ్యక్షుడు తాజుద్దీన్, మండల పార్టీ సమన్వయకర్త వాంకుడోత్ గాంధీ, ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు నునావత్ సాయికిరణ్, మైనారిటీ సెల్ నాయకుడు షఫీ, భూక్యా శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



ఆపదలో ఆపన్నహస్తంగా యువ ఆపద మిత్రలు!

8వ బెటాలియన్‌లో యువ ఆపద మిత్ర రెండో బ్యాచ్ శిక్షణ ముగింపు

వరదలు, అగ్నిప్రమాదాలు, అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలు కాపాడేలా వారం రోజుల పాటు ప్రత్యేక శిక్షణ

శేరిలింగంపల్లి : నవంబర్ 2:

విపత్తులు సంభవించినప్పుడు ప్రజలకు అండగా నిలుస్తూ, ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడేందుకు యువతను సిద్ధం చేయడమే లక్ష్యంగా యువ ఆపద మిత్ర శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. విపత్కర పరిస్థితుల్లో ధైర్యంగా స్పందించడం, బాధితులకు తక్షణ సహాయం అందించడం, ప్రాణరక్షక నైపుణ్యాలను ఆచరణలో పెట్టడంపై యువతకు అవగాహన కల్పించారు. ఈ క్రమంలో 8వ బెటాలియన్‌లో యువ ఆపద మిత్ర రెండో బ్యాచ్‌కు నిర్వహించిన వారం రోజుల శిక్షణ విజయవంతంగా ముగిసింది. బెటాలియన్ కమాండెంట్ డి. శివప్రసాద్ రెడ్డి సమక్షంలో, అడిషనల్ కమాండెంట్ ఎం. జయరాజు ఆధ్వర్యంలో శిక్షణ ముగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర విపత్తు స్పందన దళం (ఎస్ డీ ఆర్ ఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిక్షణలో వరదలు, అగ్నిప్రమాదాలు తదితర విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాద బాధితులను రక్షించే విధానాలు, ప్రథమ చికిత్స, కార్డియోపల్మనరీ రిసిసిటేషన్ (సీపీఆర్) వంటి ప్రాణరక్షక నైపుణ్యాలపై శిక్షణ ఇచ్చారు. కేవలం సిద్ధాంతపరమైన అవగాహనకే పరిమితం కాకుండా, ఆయా పరిస్థితుల్లో ఎలా స్పందించాలనే అంశంపై ప్రాక్టికల్‌గా మెలకువలను నేర్పించారు.



సమాజ సేవలో యువ ఆపద మిత్రల పాత్ర కీలకం

శిక్షణ పూర్తి చేసుకున్న యువ ఆపద మిత్ర సభ్యులను అడిషనల్ కమాండెంట్ ఎం. జయరాజు అభినందించారు. ఈ సందర్భంగా వారి చేతుల మీదుగా సభ్యులకు సర్టిఫికెట్లు, ఐడీ కార్డులను అందజేశారు. ప్రకృతి వైపరీత్యాలు, అగ్నిప్రమాదాలు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో బాధితులకు సహాయ సహకారాలు అందించడంలో యువ ఆపద మిత్రల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. శిక్షణలో నేర్చుకున్న నైపుణ్యాలను అవసరమైన సమయాల్లో సమర్థంగా వినియోగిస్తూ, ప్రజల ప్రాణాలను కాపాడేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు డి. సత్యనారాయణ, వి. అనిల్ కుమార్, ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ బిందు, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, ఎస్డీఆర్ఎఫ్ బెటాలియన్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. వారం రోజుల పాటు విపత్తుల నిర్వహణ, ప్రాణరక్షణ చర్యల్లో శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న యువ ఆపద మిత్ర సభ్యులకు అధికారులు అభినందనలు తెలిపారు.